## వేగవంతంగా గోదావరి పుష్కర పనులు పూర్తి చేస్తాం

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**






జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఆదిలాబాద్

మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

ఆదివారం 30 ఆగస్టు 2026 | పేజీలు : 8


# డీసీసీ రచ్చ!





**ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు**

**డీసీసీ అధ్యక్షుడిపై బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తిరుగుబాటు!**

**ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నరేష్ జాదవ్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు, విలువ ఇవ్వడం లేదని, - మిగతా3లో

## ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 29, (ప్రజా జ్యోతి )** ఓటర్ల జాబితా పరిశీలన, స వరణ, నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియలను పూర్తి గా పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి తొలగింపున కు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ఖానాపూర్ మున్సిపల్ సమావేశం రసాభాస

## అధికారుల తీరుపై మండిపడ్డ చైర్మన్,వైస్ చైర్మన్

### కమిషనర్ను తొలగించాలంటూ టేబుల్ తీర్మానం

### ప్రమాణ స్వీకారోత్సవ ఖర్చు రద్దు

**ఖానాపూర్ ఆగస్టు 29( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మున్సిపల్ నెలవారి సాధారణ సమావేశం శనివారం రస బసగా జరిగింది మున్సిపల్ కమిషనర్ పైనే తనను తొలగించాలంటూ తీర్మానం చేయడం గమనార్హం మున్సిపల్ ఏర్పడిన నాలుగు సమావేశాల్లో ఒక సమావేశం వాయిదా కాగా మూడవ సమావేశం సైతం పాలకవర్గ సభ్యుల అనైక్యత కారణంగా రసాభాస గానె ముగిసింది



# ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**సెప్టెంబర్ 10 వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన**

**ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం**

**టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి**



**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా ఎన్‌ఈహెచ్‌ఎస్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రూ.12 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు 17 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు సెప్టెంబర్ 10వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి కే. రమేష్‌తో పాటు ఉద్యోగులు రవికిషోర్, సతీష్, పద్మశ్రీ, అనూష, వినోద్, మల్లేష్, జనార్దన్, జీనత్, షారుక్, మహేందర్, అరుణ, సుమంత్, రజిత, నరేష్, నరేందర్, రాజం, పోచం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాష పరిరక్షణ ప్రతి తెలుగువారి కనీస ధర్మం

**గిడుగు రామమూర్తి సేవలు అనిర్వచనీయం డా. దాసరి శ్రీనాథ్ గౌడ్**





**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలుగు భాష పరిరక్షణ ప్రతి తెలుగువారి కనీస ధర్మమని డా. దాసరి శ్రీనాథ్ గౌడ్ అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించు కుని నిర్వహించే తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సంగీత సాహిత్య సుధావాహిని సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో శుక్రవారం కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల బస్టాండ్ ఎదురుగా ఉన్న సీఎంఆర్ కాంప్లెక్స్ సెల్లార్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డా. దాసరి శ్రీనాథ్ గౌడ్ సభాధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు అక్కల రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా దండనాయకుల వామన్‌రావు, చేపూరి స్వామిగౌడ్, సాదుల నందమయ్య, గొల్లపల్లి బ్రహ్మయ్య ఆచార్య, దుర్గం రాజేష్‌గౌడ్, గోపాల కృష్ణ, రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. దాసరి శ్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ, తెలుగు భాషకు ఉన్న విశిష్టత, ఔన్నత్యాన్ని వివరించారు. తెలుగు భాష కోసం గిడుగు రామమూర్తి పంతులు చేసిన విశేష కృషిని కొనియాడుతూ ఆయన సేవలు అనిర్వచనీయమైనవని పేర్కొన్నారు. తెలుగు భాషను ప్రజలందరికీ మరింత చేరువ చేయడంలో గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ తెలుగు భాషపై మక్కువ పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలుగు వారిగా తమ మాతృభాషను కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆంగ్ల భాషను నేర్చుకోవడం తప్పు కాదని, అయితే తెలుగువారిగా తెలుగులో మాట్లాడటం, తెలుగులో సంభాషించడం గర్వించదగిన విషయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వీలైనంత వరకు తెలుగులో మాట్లాడాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష అభివృద్ధి, ఉన్నతికి ప్రభుత్వం కూడా మరింత కృషి చేయాలని కోరారు. కవి సమ్మేళనంలో స్థానిక కవులు తమ స్వీయ కవితలను కవితాగానం ద్వారా వినిపించి అలరించారు. కళాకారులు చక్కని గీతాలను ఆలపించి కార్యక్రమా నికి సాహిత్య, సంగీత శోభను తీసుకువచ్చారు. కార్యక్రమంలో మహిళా కవయిత్రులు పోటు హైమావతి, సుజాతతో పాటు సంగీత సాహిత్య సుధావాహిని సంస్థ మహిళా కార్యదర్శి శ్రీమతి దాసరి పద్మ పాల్గొన్నారు. నోముల చంద్రశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, కళాకారులందరినీ సంగీత సాహిత్య సుధావాహిని సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయంగా సత్కరించారు. తెలుగు భాష, సాహిత్యం, సంగీతం, కళల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## టైగర్ జోన్ రద్దు చేయాలి-ఏకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలి

**ఏడవ రోజుకు చేరిన భూమాచారి దీక్ష**



**జన్నారం,ఆగస్ట్29(ప్రజాజ్యోతి)**జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ పూర్తిగా రద్దు చేసి ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన శ్రీరాముల భూమా చారి చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. పండగలను కూడ పక్కనపెట్టి, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మండల అభివృద్ధి కోసం శ్రీరాముల భూమాచారి రిలే నిరాహార దీక్ష చేపట్టాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ ను పూర్తిగా రద్దు చేసి, ఎకో సెన్సిటివ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 2012లో కవ్వాల్ టైగర్ జోన్ గా ప్రకటించారని, ఇప్పటికి 14 సంవత్సరాలు గడిచిన కానీ పులుల జాడ మాత్రం లేదని అన్నారు. అలాగే ఎకో సెన్సిటివ్ జోన్ తో విధించిన ఆంక్షలు వల్ల ఇసుక కొరతతో సిసి రోడ్ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పలు నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గుడిహత్నూర్ నుండి జన్నారం మీదుగా కరీంనగర్ వరకు నాలుగు వరసల జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని, అడవిని కాపాడవలసిన అటవీ శాఖ అధికారులను ఇసుక పేరుతో సస్పెండ్ చేశారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అటవీ శాఖ 41 రోజుల వరకు స్పందించకపోతే ఆ తర్వాత ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీజేవైఎం దీక్ష**

**నిధులు ఇవ్వకపోతే పోరాటం ఉధృతం: బీజేపీ నేతలు**



**ఆసిఫాబాద్ ఆగష్టు 29 ప్రజా జ్యోతి** విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం కొమరం భీం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన దీక్ష నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ నాయకత్వంలో స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడు తోందని మండిపడ్డారు. బకాయిలు నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వరరావు, పూర్వ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోవా విజయ్, కంద్రే విశాల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు సప్త శ్రీనివాస్, సంజు, వికాస్, అర్జున్, పలు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

## క్రమశిక్షణ, బాధ్యతాయుత ఆలోచనతో ముందుకు సాగాలి

## కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, సమాజం పట్ల సేవాభావాన్ని పెంపొందించుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సూచించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ గుడిపేటలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన విద్యార్థి మండలి పదవీ స్వీకారోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన విద్యార్థి మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, వారికి బాధ్యతలను అప్పగించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ ప్రతిభను వెలికితీసేందుకు విద్యార్థి మండలి వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థి మండలి ద్వారా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు, పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. తోటి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తూ, పాఠశాలలో మంచి వాతావరణాన్ని నెలకొల్పేందుకు తమవంతు కృషి చేయాలని నూతన మండలి సభ్యులకు సూచించారు. అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో, నిబద్ధతతో నిర్వహించాలని కోరారు. విద్యార్థి మండలి పదవీ స్వీకారోత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విద్యార్థి నాయకులకు అభినందనలు తెలిపారు. నాయకత్వం అనేది పదవితో కాకుండా బాధ్యతతో కూడుకున్నదని, విద్యార్థి దశలోనే ఆ భావనను అలవర్చుకోవడం భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందని కార్యక్రమంలో అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సీనియర్ వెటరన్ క్రీడాకారుడు కిష్టయ్యకు ఘన సన్మానం

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణాపూర్‌కు చెందిన సీనియర్ వెటరన్ క్రీడాకారుడు, సింగరేణి విశ్రాంత ఉద్యోగి అయ్యోరి కిష్టయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కిష్టయ్యకు పూల బొకే అందజేసి, శాలువాతో ఆత్మీయంగా సత్కరించి ఆయన క్రీడా సేవలను కొనియాడారు. ఆర్‌కే-1ఏ గనిలో హెడ్ ఓవర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అయ్యోరి కిష్టయ్య సింగరేణిలో పనిచేసిన రోజుల నుంచే వివిధ క్రీడా పోటీల్లో చురుగ్గా పాల్గొని కోల్ ఇండియా స్థాయిలో అనేక బహుమతులు సాధించి సింగరేణికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం 89 సంవత్సరాల వయసులోనూ సీనియర్ వెటరన్ క్రీడాకారుడిగా తన క్రీడా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ వివిధ సంస్థలు నిర్వహిస్తున్న జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. పరుగు పందెం, జావెలిన్ త్రో, షాట్‌పుట్ తదితర క్రీడల్లో పాల్గొంటూ అనేక పతకాలు, బహుమతులు సాధించడం అభినందనీయమన్నారు. వయసును ఏమాత్రం లెక్కచేయకుండా క్రీడలపై తనకున్న మక్కువతో నిరంతరం సాధన చేస్తూ బంగారు పతకాలతో పాటు అనేక విజయాలు సాధిస్తున్న కిష్టయ్య నేటి యువతకు, విద్యార్థులకు, క్రీడాకారులకు స్ఫూర్తిదాయకుడని కొనియాడారు. కిష్టయ్య స్ఫూర్తితో విద్యార్థినీ విద్యార్థులు, యువ క్రీడాకారులు క్రీడలపై ఆసక్తి పెంచుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని వారు సూచించారు. క్రీడలకు వయసు అడ్డంకి కాదని తన ప్రస్థానం ద్వారా నిరూపించిన కిష్టయ్య మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాల తో పదికాలాల పాటు చల్లగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు అల్లోయిన గంగయ్య, బూర్ల జ్ఞాని, ఎన్. సదాశివ్, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, సలహాదారుడు పెట్టం లక్ష్మణ్, ఎం. అంజయ్య, మురహరి, రాజన్న గౌడ్, కాటం లక్ష్మణ్, హనుమండ్ల బుచ్చయ్య, పోతరాజుల చంద్రయ్య, జి. లక్ష్మీనారాయణ, చుంచు గురువయ్య, రాంబ్రహ్మం, ఇరుకుల జనార్దన్, అన్నం శంకర్, గోపతి లక్ష్మణ్, కడిచర్ల రాజేశం, సర్వేశ్వర చారి, పేరాల రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.



## రూ.42 లక్షల ప్రజాధనం వృథా!

### నాలుగు నెలలు గడవకముందే కెనాల్ రివిట్‌మెంట్ కొట్టుకుపోయింది

### నాసిరకం పనులపై గ్రామస్తుల ఆగ్రహం.. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**ఆసిఫాబాద్, ఆగస్టు 29 ప్రజా జ్యోతి** ప్రభుత్వం ప్రజల సొమ్ముతో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యత లోపంతో కొద్దికాలానికే కొట్టుకుపోవడంపై మాణిక్‌గూడ గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్ మండలం మాణిక్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మాణిక్‌గూడ గ్రామంలో కుమురం భీమ్ ప్రాజెక్టు కుడి కాలువ రివిట్‌మెంట్ పనులకు ప్రభుత్వం సుమారు రూ.42 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పనులు పూర్తయిన నాలుగు నెలలు కూడా గడవకముందే కెనాల్ రివిట్‌మెంట్ నిర్మాణం పెద్దఎత్తున దెబ్బతిని కొట్టుకుపోవడంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయని వారు ఆరోపిస్తున్నారు.

**ప్రారంభోత్సవం ఘనంగా.. ఫలితం మాత్రం శూన్యం**

మాణిక్‌గూడ గ్రామ పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉన్న కాలువ వద్ద రివిట్‌మెంట్ పనులను స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ తదితరుల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించినట్లు గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. భారీ మొత్తంలో నిధులు వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ, పనులు పూర్తయిన కొద్దికాలానికే కాలువ గట్టు బలహీనపడటం, రివిట్‌మెంట్ రాళ్లు, నిర్మాణ సామగ్రి కొట్టుకుపోవడం జరిగిందని పేర్కొన్నారు. చిన్నపాటి వర్షానికే నిర్మాణం దెబ్బతినడం పట్ల గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించారా? ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేశారా? నాణ్యతా పరీక్షలు నిర్వహించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని వారు అంటున్నారు.

**ఇళ్లకు ముప్పు.. భయాందోళనలో ప్రజలు**

రివిట్‌మెంట్ కొట్టుకుపోవడంతో కాలువ గట్టు క్రమంగా కోతకు గురవుతోందని, దీంతో కాలువకు సమీపంలో నివాసం ఉంటున్న కుటుంబాల ఇళ్లకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మరింతగా కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కాలువ గట్టును పరిశీలించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**నాసిరకం పనులా? సమగ్ర విచారణ జరపాలి**

రూ.42 లక్షల ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణం నాలుగు నెలలు కూడా నిలవకపోవడంపై సమగ్ర విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పనుల నాణ్యత, ఉపయోగించిన నిర్మాణ సామగ్రి, అంచనాలు, కొలతలు, బిల్లుల చెల్లింపులు, అధికారుల పర్యవేక్షణ తదితర అంశాలపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా లేదా నాసిరకం పనులు జరిగి ఉంటే సంబంధిత కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్‌ను బాధ్యుడిని చేసి నష్టాన్ని రికవరీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే కాంట్రాక్టర్ లైసెన్సును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కోరుతున్నారు.

**వెంటనే పనులు పునఃప్రారంభించాలి**

కాలువ రివిట్‌మెంట్ కొట్టుకుపోయిన ప్రాంతాన్ని వెంటనే పునర్నిర్మించాలని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలు, ఇళ్లకు ముప్పు ఏర్పడే వరకు అధికారులు వేచి చూడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాధనంతో చేపట్టిన రూ.42 లక్షల పనులు నాలుగు నెలలకే దెబ్బతినడంపై అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాణిక్‌గూడ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# నేత్రదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చు

## విద్యార్థులకు నేత్రదానం, కంటి ఆరోగ్యం, వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** నేత్రదాన అవగాహన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం మంచిర్యాల సాయికుంటలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నేత్రదానం, కంటి ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటికి సంబంధించిన వ్యాధులు, కంటి చూపును కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలతో పాటు నేత్రదానం ప్రాముఖ్యతను అధికారులు వివరించారు. నేత్రదానం ద్వారా మరణానంతరం ఇతరులకు కంటి చూపును అందించి వారి జీవితాలను ఆనందమయం చేయవచ్చని తెలిపారు. నేత్రదానం ఎంతో విలువైనదని, ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా అతని నేత్రాల ద్వారా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని వివరించారు. నేత్రదానం పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామాల్లోని ప్రజలకు కూడా నేత్రదానం ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించాలని కోరారు. కంటి ఆరోగ్యంపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ కంటి సంబంధిత వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడం, కంటికి ఇబ్బందులు ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం, అవసరమైన చికిత్సలు పొందడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శరీర ఆరోగ్యంతో పాటు కంటి ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా దోమలు పుట్టకుండా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కలుషిత నీరు, అపరిశుభ్రమైన ఆహారం ద్వారా వ్యాపించే జాండీస్, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచినీటిని మాత్రమే తాగాలని, ఆహార పదార్థాలను శుభ్రంగా, వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలని, బయట లభించే ఆహార పదార్థాలను సాధ్యమైనంత వరకు తీసుకోరాదని సూచించారు. జంక్‌ఫుడ్‌ను అధికంగా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వాటికి దూరంగా ఉండి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలి ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. స్థానిక ఆరోగ్య కార్యకర్తల ద్వారా ముందస్తు చర్యలు చేపట్టడంతో





పాటు అవసరమైన మందులను వైద్యుల సూచన మేరకు తీసుకోవాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛమైన నీరు, పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయి, వాటిని నివారించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, తమ కుటుంబ సభ్యులకు, గ్రామాల్లోని ప్రజలకు కూడా ఈ విషయాలను తెలియజేసి ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. నేత్రదానం పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు .ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌ఓలు నాందేవ్, పుట్ట సత్తయ్య, కాకిరాల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ పద్మ, జిల్లా కంటి నియంత్రణ కోఆర్డినేటర్ శంకర్, ఏపీడీ మాలిస్టు సుమన్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 31 డిమాండ్లు ఏమిటి? పరిష్కారానికి ఒప్పుకున్న 24 సమస్యలు ఏవి?

**శ్వేతపత్రం విడుదల చేయాలి**

**అమలైన, గతంలోనే అంగీకరించిన అంశాలను ఇప్పుడు పోరాడి సాధించామని చెప్పుకోవడం సిగ్గుచేటు**

**ఏఐటీయూసీకి విప్లవ కార్మిక సంఘాల నాయకుల సూటి ప్రశ్నలు**

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చి పోరాటానికి సిద్ధమైన నేపథ్యంలో, హైదరాబాద్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో చర్చలు జరిగాయని, అందులో 24 సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తాజాగా వార్తలు వెలువడుతున్నాయని విప్లవ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. అయితే అసలు 31 డిమాండ్లు ఏమిటి? వాటిలో పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించిన 24 సమస్యలు ఏవి? ఇంకా పెండింగ్‌లో ఉన్న ఏడు డిమాండ్లు ఏమిటి? అనే వివరాలను మాత్రం కార్మికులకు వెల్లడించకపోవడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై చర్చలు జరిగాయని చెప్పడం మాత్రమే సరిపోదని, ప్రతి డిమాండ్‌పై ఏఐటీయూసీ చేసిన ప్రతిపాదన ఏమిటి? యాజమాన్యం దేనికి అంగీకరించింది? ఏ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది? అనే పూర్తి వివరాలను కార్మిక వర్గం ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చలకు సంబంధించిన పూర్తి వివరాలను, లిఖితపూర్వక ఒప్పందాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. 31 డిమాండ్ల పూర్తి జాబితా ఎక్కడ? ఏఐటీయూసీ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో సమర్పించిన 31 డిమాండ్ల పూర్తి జాబితాను వెంటనే కార్మికుల ముందుంచాలని విప్లవ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి డిమాండ్ వెనుక వేలాది మంది సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సమస్యలు ముడిపడి ఉన్నాయన్నారు. కార్మికుల వేతనాలకు సంబంధించిన డిమాండ్లు ఏమిటి? పెర్క్స్, అలవెన్సులు, ఆదాయపు పన్ను సమస్యపై ఎలాంటి ప్రతిపాదనలు చేశారు? సహజ మరణం సంభవించిన కార్మికుల కుటుంబాలకు పరిహారం అంశాన్ని చర్చల్లో ప్రస్తావించారా? డిపెండెంట్ ఉద్యోగాలపై ఏ డిమాండ్ పెట్టారు? ఖాళీ పోస్టుల భర్తీ, కొత్త ఉద్యోగాల కల్పనపై యాజమాన్యం ఏ విధంగా స్పందించింది? ప్రమోషన్లు, బదిలీల సమస్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు? సింగరేణి ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాల మెరుగుదలపై ఏం అంగీకారం కుదిరింది? అనే అంశాలను స్పష్టంగా వెల్లడించాలని వారు కోరారు. గతంలో అమలైన వాటినీ ఇప్పుడు సాధించామని చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలోనే అమలైన లేదా యాజమాన్యం గతంలోనే అంగీకరించిన అంశాలను ఇప్పుడు పోరాటం చేసి సాధించామని చెప్పుకోవడం సిగ్గుచేటని విప్లవ కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. నిజంగా కొత్తగా సాధించిన ప్రయోజనాలు ఏమిటో, గతంలో అమలులో ఉన్న అంశాలు ఏమిటో కార్మికులకు స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీకి కార్మికులపై




చిత్తశుద్ధి ఉంటే పరిష్కారమైన 24 డిమాండ్లు, పెండింగ్‌లో ఉన్న ఏడు డిమాండ్ల పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులను చీకట్లో ఉంచకుండా చర్చల పూర్తి వివరాలను వెల్లడించాలని, లిఖితపూర్వక ఒప్పంద ప్రతిని కార్మిక సంఘాలు, కార్మికుల ముందు ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణిరామ్‌సింగ్, సింగరేణి కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (టీఎన్‌టీయూసీ), రాష్ట్ర కార్యదర్శి పోషమల్లు (ఏఐఎఫ్‌టీయూ), సింగరేణి గని కార్మిక సంఘం (ఎస్‌జీకేఎస్) రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ లేబర్ యూనియన్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు గజ్జె దుర్గయ్య, బెల్లంపల్లి టీఎన్‌టీయూసీ పట్టణ ఆర్గనైజర్ కైదల మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ..

## ఘనంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినోత్సవం

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి సునీత, వైస్ ప్రిన్సిపాల్ వహీదా, తెలుగు శాఖ అధ్యాపకులు కె. సరిత, కె. రజిత, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యాపకులు మాట్లాడుతూ, తెలుగు భాష అభివృద్ధికి, ప్రజలందరికీ సులభంగా అర్థమయ్యే వ్యవహారిక భాషను ప్రోత్సహించేందుకు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన చేసిన సేవలు ఎంతో గొప్పవని వివరించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి సునీత మాట్లాడుతూ తెలుగు భాషకు ఎంతో విశిష్టమైన చరిత్ర, సాహిత్య సంపద, సాంస్కృతిక వారసత్వం ఉందని అన్నారు. మాతృభాషపై ప్రతి ఒక్కరూ అభిమానం పెంచుకోవడంతో పాటు తెలుగు భాషను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ వహీదా మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని, అందులోని




మాధుర్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. తెలుగు భాషను పరిరక్షించి, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థినులు తెలుగు భాష పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, దైనందిన జీవితంలో తెలుగును విస్తృతంగా ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు తెలుగు భాష ప్రాముఖ్యత, గిడుగు వెంకట రామమూర్తి పంతులు చేసిన సేవలు, తెలుగు భాష పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 4 నుంచి శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి వార్షిక క్రీడా పోటీలు

## శ్రీరాంపూర్ ఏరియా జి.ఎం. మునిగంటి శ్రీనివాస్

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా 2026--27 శ్రీరాంపూర్ ఏరియా అంతర్ విభాగ క్రీడా పోటీలు సెప్టెంబర్ 4 నుంచి ప్రగతి స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 4న వాలీబాల్, 5న బాస్కెట్‌బాల్ 6న షటిల్ బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళలు), టేబుల్ టెన్నిస్ (పురుషులు, మహిళలు), చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నా రు. సెప్టెంబర్ 7న బాల్ బ్యాడ్మింటన్, 8న ఫుట్‌బాల్, 9న హాకీ, 10న లాన్ టెన్నిస్, 11న కబడ్డీ పోటీలు జరగనున్నాయి. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో క్రికెట్ పోటీలు, 15న అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు), మహిళల త్రోబాల్, పురుషుల స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 20న పురుషులు, మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 27న పురుషులు, మహిళలకు పవర్ లిఫ్టింగ్, పురుషులకు బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాలను కలిపి మొత్తం నాలుగు జట్లుగా ఏర్పాటు చేసి పోటీలను నిర్వహించనున్నారు. జట్టు--1లో ఎస్ఆర్‌పీ--1, ఎస్ఆర్‌పీ--3; జట్టు--2లో ఆర్‌కే--5, ఐకే--1, ఐకే--ఓసీ; జట్టు--3లో ఆర్‌కే--7, ఆర్‌కేఎన్‌టీ; జట్టు--4లో ఎస్ఆర్‌పీ ఓసీ, ఇతర విభాగాలు, ఎస్‌టీపీపీ ఉండనున్నాయని తెలిపారు .పోటీలను ప్రగతి స్టేడియం, శాంతి స్టేడియం, ఎస్‌సీఓఏ క్లబ్, సీసీసీ, సేవా భవన్, నస్పూర్ తదితర వేదికల్లో నిర్వహించనున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో క్రీడల్లో ప్రావీణ్యం కలిగిన ఉద్యోగులు, ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొని జట్లుగా ఏర్పడి పోటీల్లో తమ ప్రతిభను చాటాలని, 2026--27 వార్షిక క్రీడా పోటీలను విజయవంతం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కోరారు.



The Singareni Collieries Company Limited
(A Government Company)
Srirampur Area

Ref.No.SRP/PER/15.007/3616 Date:28.08.2026

CIRCULAR

GM, STPP
All Head of Mines & Depts., SRP Area

Sub : Conducting of Sports & Games of WPS&GA,SRP Area for the year 2026-27 -Reg.
Ref. No : CRP/PER/WEL/SPORTS/2026-27/2986, Dtd.20.08.2026.
-000-

It has been decided to conduct the WPS&GA, SRP Area Departmental Sports & Games for the year 2026-27, the inauguration event will be conducted on 04.09.2026. The Indore and Outdoor tournaments will be conducted as per the following schedule given below at Pragathi Stadium and Krishna Colony Ground, SRP Area from 8.00 am in the morning and 3.00 pm in the evening session.

The formation of the Teams for the above Games is as follows:

| Sl.No | Mine/Dept | Name of the Group |
|---|---|---|
| 01 | SRP-1 Inc, SRP3&3A Inc | SRP Group |
| 02 | RK-5 Inc / IK-1A / IK OC | RK-I Group |
| 03 | RK-7 Inc & RKNT | RK-II Group |
| 04 | SRP OCP / Other Dept of SRP Area & STPP | Others Group |

The Teams of the each Group as detailed above should come to play the matches preparedly. The draws will be displayed at the venue.

No relief muster will be given on Sunday to players / Organizers. The organizers are allowed to take compensatory rest on any working day. The absence of players & organizers who will participate in the outdoor events will be treated as "on duty" and the musters will be advised by Hony. Secretary WPS&GA, SRP Area.

| SN | Event | Date | No. of players | Venue |
|---|---|---|---|---|
| 01 | Volleyball | 04.09.2026 | 9 participants each group | PRAGATHI STADIUM |
| 02 | Basketball | 05.09.2026 | 8 participants each group | |
| 03 | Shuttle Badminton (SCOA CLUB, CCC) | 06.09.2026 Sunday | 2 Women Singles & 4 Men & 4 Veteran Participants from each group | |
| 04 | Chess (SCOA CLUB, CCC) | --do-- | 5 participants each group | |
| 05 | Table Tennis (Sevabhavan, Naspur) | --do-- | 4 Men, 4 Veteran & 2Women Participants from each group | |
| 06 | Carrom (CER Club, SRP) | --do-- | 4 participants each group | |
| 07 | Ball Badminton | 07.09.2026 | 8 participants each group | |
| 08 | Football | 08.09.2026 | 14 participants each group | |
| 09 | Hockey | 09.09.2026 | 14 participants each group | |
| 10 | Lawn Tennis | 10.09.2026 | 4 Men & 4 Veteran from each group | |
| 11 | Kabaddi | 11.09.2026 | 10 participants each group | |
| 12 | Cricket | 12&13.09.2026 | 14 participants each group | |

--2--



# ఉచిత బియ్యం పంపిణీ గడువును మరో వారం పొడిగించాలి

**మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి**



**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన ఉచిత బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించిన గడువు మరో రెండు రోజుల్లో ముగియను న్నప్పటికీ మంచిర్యాల జిల్లాలో ఇంకా అనేక మంది లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారని భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ తెలిపా రు. అదేవిధంగా జిల్లాలోని పలు రేషన్ దుకాణాల వద్ద ఉచిత బియ్యం నిల్వలు ఇంకా పెద్ద మొత్తంలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలకు అందాల్సిన బియ్యం రేషన్ దుకాణాల్లోనే మిగిలిపోకుండా, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఉచిత బియ్యం అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత బియ్యం పంపిణీ గడువును మరోవారం రోజుల పాటు పొడిగించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు నగునూరి వెంకటేశ్వర గౌడ్ తెలిపారు.

# స్వాధీనం చేసుకున్న అటవీ భూములలో మొక్కల పెంపకం ఎఫ్.డి.ఓ రామ్మోహన్





**జన్నారం,ఆగస్ట్29(ప్రజాజ్యోతి)**అటవీ భూములను అక్రమించుకుని, గుడిసెలు వేసుకున్న స్థలాలను తిరిగి స్వాదీనం చేసుకుని వాటి స్థానంలో మొక్కల పెంపకం చేపట్టినట్లు ఫారెస్ట్ డివిజనల్ అధికారి (ఎఫ్డీవో) రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం జన్నారం అటవి డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్నారం డివిజన్ జన్నారం రేంజ్ పరిధిలోని గడ్డంగూడలోని 308 కంపార్ట్మెంట్ నంబర్ లో గల ఆట భూమిని గత 15 సంవత్సరాలుగా లక్ష్మీపూర్ తండాకు చెందిన గిరిజనులు ఆక్రమించుకొని గుడిసెలు వేసుకోవడం జరిగిందన్నారు. సంవత్సరాల కాలంగా గుడిసెలను తొలగించడం. తిరిగి వేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో జనవరి మాసంలో అటవిశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం గడ్డంగూడలో గుడిసెలను తొలగించి, ముగ్గురిపై అటవి చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపగా వారు 47 రోజులు జైలులో ఉండటం జరిగిందన్నారు. అదే విధంగా పలువురిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఆ భూమిలో వారు తిరిగి గుడిసెలు వేసుకోకుండా కందకాలు తవ్వించి సుమారుగా 25 ఎకరాల్లో మొక్కలు నాటడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా తాళ్లపేట్ రేంజ్ దమ్మన్నపేటలో పదిఎకరాలు, ఇందన్ పెల్లి రేంజ్ పాలఘోరీ ప్రాంతంలో ఐదు ఎకరాల అటవి భూములను తిరిగి అక్రమించుకొని మొక్కలు నాటడం జరిగింద న్నారు. ఈ భూములు గుగూల్ ఎర్త్ చిత్రాలలో గాని, ల్యాండ్ కవర్ చేంజ్ మ్యాప్ పరిశీలనలో 13 డిసంబర్ 2005 కటాఫ్ తేదీ కి ముందు లేవని నిర్ధారణ అయిందన్నారు. అటవీ భూమిని ఆక్రమించుకోవడం చట్టప్రకారం నేరమని, ప్రజలు గుర్తించి ఎవరైన చెపితే వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ ఆడవులు ఇక్కడి ప్రజలవని, ఈ వనరులను కాపాడుకోవాల్సిన భాధ్యత ఇక్కడి ప్రజలపై ఉందన్నారు .

# రెండోవిడతా ఇందిరమ్మ ఇల్లు.. పేదల హక్కుగా మారాలి!

## రెండో విడతలో నిజమైన నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలి

## 28 గ్రామపంచాయతీల్లో ఇంటింటి పరిశీలన చేపట్టాలి అర్హత లేని పేర్లపై సమగ్ర విచారణ జరపాలి

## వాంకిడి మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ డిమాండ్

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు29 (ప్రజాజ్యోతి):**ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల ఆశలకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం భరోసాగా నిలవాలని, రాజకీయాలు, వ్యక్తిగత పరిచయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి అవకాశం కల్పించాలని వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ కోరారు. వాంకిడి మండలంలోని 28 గ్రామపంచాయతీల పరిధిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ అంశంపై స్పందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని, ముఖ్యంగా సొంత ఇల్లు లేని కుటుంబాలను గుర్తించడంలో అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు.

**జాబితా తయారీతో పని పూర్తికాదు**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా తయారు చేయడం మాత్రమే కాకుండా, అందులో ఉన్న పేర్లు వాస్తవంగా అర్హులవేనా? కాదా? అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించాల్సిన అవసరం ఉందని ఉప్పుల కృష్ణ పేర్కొన్నారు. ఒక కుటుంబం ఏళ్లుగా గుడిసెలో జీవిస్తుండగా, మరోవైపు ఇప్పటికే స్థిరమైన నివాసం, ఆదాయ వనరులు ఉన్న కుటుంబం జాబితాలో చోటు సంపాదిస్తే అసలైన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. అందుకే 'కాగితాలపై అర్హత' కంటే 'క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి'కి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

**ఇంటింటికీ వెళ్లి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలి**

మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. ప్రస్తుతం కుటుంబం ఏ ఇంట్లో నివసిస్తోంది, ఆ ఇల్లు సొంతమా? అద్దెదా? శిథిలావస్థలో ఉందా? కుటుంబానికి ఇతర నివాస సదుపాయం ఉందా? అనే అంశాలను పరిశీలించాలని అన్నారు. అలాగే కుటుంబ సభ్యుల సంఖ్య, జీవన పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు వంటి అంశాలను కూడా నిబంధనల మేరకు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ విధంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిగితే నిజమైన లబ్ధిదారులను గుర్తించడం సులభమవుతుందని పేర్కొన్నారు

**బీఆర్ఎస్ సర్పంచ్‌లపై ఆరోపణలపై విచారణ చేయాలి**

కొన్ని గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్‌కు చెందిన కొంతమంది సర్పంచ్‌లు తమ ఇష్టానుసారంగా లబ్ధిదారుల పేర్లను ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయని ఉప్పుల కృష్ణ తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు, ఇప్పటికే స్థిరమైన ఆర్థిక పరిస్థితి ఉన్నవారు లేదా సొంత నివాస సదుపాయం ఉన్నవారి పేర్లు ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. అయితే ఆరోపణలు నిజమా? కాదా?అనే విషయాన్ని సంబంధిత అధికారులు అధికారికంగా విచారించి నిర్ధారించాలని ఆయన అన్నారు. ఎవరిపైనా రాజకీయ కారణాలతో ఆరోపణలు చేయడం కాకుండా, అర్హతను నిబంధనల ప్రకారం పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.

**గ్రామసభే కీలక వేదిక**

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని ఉప్పుల కృష్ణ కోరారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను గ్రామ ప్రజల సమక్షంలో వెల్లడించి, అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే వాటిని స్వీకరించాలని అన్నారు. గ్రామస్థులకు తెలిసిన వాస్తవాలు అధికారులకు కూడా ఉపయోగపడతాయని, అయితే ప్రతి అభ్యంతరాన్ని కూడా ఆధారాలతో



పరిశీలించి నిష్పక్షపాతంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గ్రామసభ ద్వారా ప్రజలకు సమాచారం అందుబాటులో ఉంటే లబ్ధిదారుల ఎంపికపై అనుమానాలు తగ్గుతాయని పేర్కొన్నారు.

**పేదల ఆశలతో ఆటలొద్దు**

సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక కల అని, పేద కుటుంబాలకు అది మరింత పెద్ద అవసరమని ఉప్పుల కృష్ణ అన్నారు. సంవత్సరాలుగా గుడిసెల్లో జీవిస్తున్న కుటుంబాలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. వర్షాలు, ఎండలు, చలికాలంలో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఎంతో అవసరమని, అలాంటి కుటుంబాలను గుర్తించడంలో నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. ఇల్లు లేని పేద కుటుంబం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, అధికారులు స్వయంగా గ్రామాల్లోకి వెళ్లి అర్హులను గుర్తించాలని కోరారు.

**రాజకీయాలకు అతీతంగా ఎంపిక జరగాలి**

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించకుండా, పూర్తిగా సంక్షేమ దృక్పథంతో అమలు చేయాలని ఉప్పుల కృష్ణ అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పార్టీ, వర్గం, వ్యక్తిగత పరిచయాలు కాకుండా అర్హత ఒక్కటే ప్రమాణంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ పార్టీకి చెందిన వారైనా అర్హత ఉంటే ప్రభుత్వ పథకం అందాలని, అదే విధంగా ఏ పార్టీకి చెందిన వారైనా అర్హత లేకపోతే పథకానికి ఎంపిక చేయకూడదని అన్నారు. ఈ విషయంలో అధికారులు స్పష్టమైన వైఖరితో ముందుకు వెళ్లాలని కోరారు.

**పేరు రాని అర్హుల పరిస్థితి ఏంటి?**

రెండో విడత జాబితాలో పేర్లు రాని అర్హులైన నిరుపేద కుటుంబాల పరిస్థితిని కూడా అధికారులు పరిశీలించాలని ఉప్పుల కృష్ణ కోరారు. ఒక కుటుంబం నిజంగా అర్హత కలిగి ఉన్నప్పటికీ కొన్ని కారణాలతో జాబితాలో పేరు నమోదు కాకపోతే, వారికి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా జాబితాలో పేర్లు ఉన్నవారి అర్హతపై ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తే వాటిని కూడా తేలికగా తీసుకోకుండా విచారణ జరపాలని కోరారు. అర్హుడికి దక్కాల్సిన ఇల్లు మరొకరికి వెళ్లకుండా, అనర్హుడి కారణంగా అర్హుడు నష్టపోకుండా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆయన సూచించారు.

**28 గ్రామపంచాయతీలపై ప్రత్యేక నిఘా అవసరం**

వాంకిడి మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియపై సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని ఉప్పుల కృష్ణ కోరారు. ప్రతి గ్రామపంచాయతీలో ఎంపిక ప్రక్రియ ఒకే విధమైన నిబంధనల ప్రకారం కొనసాగుతున్నదా? అనే విషయాన్ని పరిశీలించాలని అన్నారు. అవకతవకలకు అవకాశం లేకుండా రికార్డులను పరిశీలించడం, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించడం, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. అర్హత లేని వ్యక్తులు జాబితాలోకి వచ్చినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

**రేకుల, గుడిసెల్,కటిక పేదలకే ప్రాధాన్యత**

వాంకిడి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో సొంత ఇల్లు లేని కటిక పేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, అత్యవసరంగా నివాస సదుపాయం అవసరమైన అర్హులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉప్పుల కృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదల కోసం తీసుకొచ్చిన పథకం కాబట్టి, పథకం ప్రయోజనం కూడా పేదలకే అందేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో చిన్నపాటి పొరపాటు జరిగినా అది ఒక కుటుంబం సొంతింటి కలను దూరం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు, రాజకీయ జోక్యాలు, అనర్హుల ఎంపికకు తావులేకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని, వాంకిడి మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి నిజమైన నిరుపేదల గడపకు ఇందిరమ్మ ఇల్లు చేరేలా చర్యలు తీసుకోవాలని ఉప్పుల కృష్ణ కోరారు.

## రక్షాబంధన్ వేడుకల్లో ఆత్మీయత

**చాపిడి సురేష్‌కు రాఖీ కట్టిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి)** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తన తమ్ముడు చాపిడి సురేష్‌కు రాఖీ కట్టి సోదరాభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం సోదరుడికి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె. అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగక్క ఆసిఫాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళి, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రక్షాబంధన్ పండుగ సోదరభావం, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.

## ఘనంగా పంచముఖ హనుమాన్ ఆలయంలో 10వ మాసోత్సవం



**ఖానాపూర్ ఆగస్టు 29 (ప్రజాజ్యోతి )** హనుమంతుడి ఆశీస్సులతో సుఖశాంతులు కలుగుతాయని పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ అన్నారు ఖానాపూర్ మండల కేంద్రంలోని కొమరం భీం చౌరస్తాలో గల శ్రీ పంచముఖ హనుమాన్ ఆలయంలో శనివారం ఆంజనేయ స్వామి జన్మ పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా,ప్రతి నెల మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామి వారికి ఆలయ అర్చకులు తిరుమల కిషోర్ ఆచార్య ఉదయం 9:00 గం "లకు గణపతి పూజ తరువాత 9:30 గం "లకు పంచామృత అభిషేకం అనంతరం విశేష అష్టోత్తర శతనామ అర్చనా కార్యక్రమం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది 10:00గం" లకు ఆంజనేయ స్వామి వారి విశేష మూల మంత్ర హోమాలు వేద పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ గణపతి విశ్వక్సేనగౌరీ నవగ్రహ హనుమాన్ మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో తోట గోదావరి హనుమంతు రెడ్డి లక్ష్మీ రాజేశ్వర్ మంత్రరాజ్యం అన్నపూర్ణా దేవేందర్ తుమ్మనపల్లి సుజాత లక్ష్మణ్ అల్లాడి రామ అంజలి తదితరులు పాల్గొన్నారు మధ్యాహ్నం 12: గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది కార్యక్రమంలో అర్చకులు తిరునగిరి గిరి నందకిషోర్ ఆచార్యులు వేద పండితులు హోమ కార్యక్రమా నిర్వాహకులు నిమ్మగడ్డ సందీప్ ఆలయ కమిటీ అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు, తోట హనుమంతు తుమ్మనపల్లి లక్ష్మణ్ సింగ్ ప్రవీణ్ భవాని రాజేశ్వర్ జోగు రాజేశ్వర్ ఎడ్ల రాజేశ్వర్ రాచమల్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# విద్య, వైద్యానికే మొదటి ప్రాధాన్యత

**ప్రతిమ ఫౌండేషన్ ఉచిత అంబులెన్సు సేవలు ప్రారంభం.**

**ఆసుపత్రిలో అన్ని రకాల సేవలందేలా కృషి చేస్తున్నామన్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు.**



**లక్షెట్టిపేట, ఆగష్టు 29 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వం విద్య, వైద్యానికే మొట్ట మొదటి ప్రాధాన్యతను ఇస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని 30 పడకల ఆసుపత్రి ఆవరణలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వెంటిలేటర్ అంబులెన్స్ సేవలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్ కు వైద్యం కోసం వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని రాష్ట్రంలోనే మోడల్ హాస్పిటల్ ను లక్షెట్టిపేటలో నిర్మించామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వైద్య సేవలు అందించేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను మెరుగైన వైద్యం అందించే ఆసుపత్రికి సురక్షితంగా తరలించేందుకు ఈ వెంటిలేటర్ అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేద, సామాన్య ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ప్రజల ఆరోగ్య భద్రతకు మరింత భరోసా కల్పిస్తుందని తెలిపారు. అనంతరం హాస్పిటల్ ను సందర్శించి, వైద్యులతో మాట్లాడి పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఇన్స్టిట్యూట్ సీ ఈ ఓ రామచంద్రరావు, ప్రతిమ హాస్పిటల్ క్రిటికల్ కేర్ డాక్టర్ ప్రవీణ్, ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్, డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నర్సయ్య,తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమీషనర్ విజయ్ కుమార్, వైస్ చైర్మన్ మోత్కూరు రాజేశ్వరి వెంకట స్వామి గౌడ్,సింగిల్ విండో చైర్మన్ చెల్ల నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, మండల అధ్యక్షులు, సర్పంచ్ నలిమెల రాజు, ముత్యాల శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, పూర్ణచంద్రరావు, కార్పొరేటర్లు కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ మున్సిపల్ సమావేశం రసాభాస అధికారుల తీరుపై మండిపడ్డ చైర్మన్,వైస్ చైర్మన్

**కమిషనర్ను తొలగించాలంటూ టేబుల్ తీర్మానం**

**ప్రమాణ స్వీకారోత్సవ ఖర్చు రద్దు**



**ఖానాపూర్ ఆగస్టు 29( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మున్సిపల్ నెలవారి సాధారణ సమావేశం శనివారం రస బసగా జరిగింది మున్సిపల్ కమిషనర్ పైనే తనను తొలగించాలంటూ తీర్మానం చేయడం గమనార్హం మున్సిపల్ ఏర్పడిన నాలుగు సమావేశాల్లో ఒక సమావేశం వాయిదా కాగా మూడవ సమావేశం సైతం పాలకవర్గ సభ్యుల అనైక్యత కారణంగా రసాభాస గానె ముగిసింది ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక అధ్యక్షత వహించగా వైస్ చైర్మన్ మహమ్మద్ సోయాబ్ హుస్సేన్ బిజెపి కౌన్సిలర్లు గుమ్ముల ఆనంద్ బొప్పారపు సత్యవతి బండపల్లి సింధుజ టిఆర్ఎస్ కౌన్సిలర్ తొడసం ఇందిరా కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజుర సత్యం నిమ్మల రమేష్ గౌర్రె తిరుమల సాజిదా బేగం మేష పోసవ్వ హాజరుకాగా రెండవ వార్డ్ బి ఆర్ఎస్ కౌన్సిలర్ రాజా గంగన్న గిర్రాజరయ్యారు సమావేశంలో పలు అంశాలను ఎజెండాగా తీసుకోగా పాత అంశాలే పూర్తి కాకపోగా కొత్త అంశాలు తీర్మానించబోమని పాలకవర్గ సభ్యులు భీష్మించుకు కూర్చున్నారు అయితే చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన 75 వేల ఖర్చులు అది పూర్తి ఒక పార్టీకి సంబంధించిన కార్యక్రమంగా పేర్కొంటూ కౌన్సిలర్లు రద్దు చేశారు పలు అంశాలపై మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ ను అధికారులను సభ్యులు నిలదీశారు ఉదయం జరగాల్సిన సమావేశాన్ని చైర్మన్ వైస్ చైర్మన్ ఆలస్యంగా వచ్చారన్న సాకుతో సమావేశం రద్దు చేయడం శోచనీయమని బిజెపి బి ఆర్ ఎస్ సభ్యులు ఆరోపించగా అరగంట పాటు వేచి చూసిన అనంతరం సమావేశం వాయిదా వేసినట్లు ఇది నిబంధనకే జరుగుతుందని సుందర్ సింగ్ తెలిపారు అయితే కేవలం కాంగ్రెస్కు సంబంధించిన సభ్యులు ఉదయం 11 గంటలకు పాల్గొని సమయాన్ని వెచ్చించకుండా వెళ్లిపోవడం దీనికి కమిషనర్ వత్తాసు పలకడం సరికాదని అన్నారు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు చైర్మన్ వైస్ చైర్మన్‌ల దుందుడుకు చర్యలను తప్పుపడుతున్నామని ఆరోపించారు అధికారులు సహకరించకుండా భయ కట్ చేయడం పట్ల చైర్మన్ వైస్ చైర్మన్ లు మండిపడ్డారు ఎజెండాలు పెట్టడం తమ స్వార్థం కోసం కాదని ప్రజాభివృద్ధి కోసమేనని వైస్ చైర్మన్ సోయబ్ ఘాటుగా స్పందించారు మున్సిపల్ పాలక సిబ్బంది నీ చైర్మన్ భర్త బెదిరింపు వల్లే బైకట్ చేశామని ఉద్యోగుల ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామన్నారు సమావేశం అధ్యంతం అర్థం లేకుండా వాదనలతో ముగిసిపోయింది మున్సిపల్ పాలకవర్గంలో బిజెపి బి ఆర్ఎస్లో అధికార స్థానంలో ఉన్న రెండు పార్టీలకు కొన్ని సందర్భాల్లో సమన్వయం లేకపోవడం అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ప్రతిపక్ష స్థానంలో ఉండడం తో ఖానాపూర్ మున్సిపల్ సమావేశం తలోక అంశాలతో పార్టీల ప్రభావాన్ని చూపించడం వల్ల మున్సిపల్ సమావేశానికి పసలేకుండా పోయింది. పాలకవర్గ సభ్యులు సమన్వయ లోపం మున్సిపల్ అధికారులపైనే ఆరోపణలు మోపడంతో కమిషనర్ తో సహా సిబ్బంది నిస్సహాయానికి గురి అయ్యారు

## ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగాజాతీయ క్రీడా దినోత్సవం



**దిలావర్ పూర్ ఆగస్టు 29,( ప్రజాజ్యోతి ).**దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని సర్పంచ్ అక్కర అనిల్, ఎ ఎస్ఐ లక్ష్మీనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది.అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ. నాగభూషణం మాట్లాడుతూ.. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ నేతృత్వంలో భారత హాకీ జట్టు ఒలింపిక్స్‌లో మూడు సార్లు స్వర్ణ పతకాలు సాధించిన ఘనతను గుర్తుచేశారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.వ్యాయామ ఉపాధ్యాయుడు అంబాజీ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, సహకార భావన, సమష్టి కృషి వంటి లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. అంబాజీ ప్రోత్సాహంతో పాఠశాల విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరిగిందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ఉపాధ్యాయులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వామన్ రావు, లక్ష్మణరావు, పోశెట్టి, రమేష్‌తో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో ఘనంగా గణేష్ కర్ర పూజ



**ఖానాపూర్ ఆగస్టు 29 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్‌లో ఇండియన్ టైగర్స్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ కర్ర పూజ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలకు సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించడంతో పాటు గణేష్ ముఖ దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గణేష్ కర్రకు పూజలు చేసి భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని కొనసాగించారు. యువత ఉత్సాహంగా పాల్గొని జై గణేష్ నినాదాలతో సందడి చేశారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ టైగర్స్ యూత్ సభ్యులు, యువత, స్థానికులు పాల్గొన్నారు.

## కంటి సమస్యలపై గ్రామస్థులకు అవగాహన కల్పించిన డాక్టర్ అగర్వాల్



**దిలావర్ పూర్ , ఆగస్టు 29,( ప్రజాజ్యోతి ).** కంటి చూపు సమస్యలు, కంటి ఒత్తిడి, ఇతర కంటి సంబంధిత సమస్యలను వైద్యులు డాక్టర్ అగర్వాల్ పరీక్షించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడం పట్ల గ్రామస్థులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. దిలావర్ పూర్ మండలంలోని బన్సపల్లి గ్రామంలో శనివారం రోజున డాక్టర్ అగర్వాల్ కంటి క్లినిక్ నిర్మల్ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు మరియు పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలపై వైద్యులు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అవసరమైతే ఆపరేషన్ కూడా చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## యోగా తో శారీరక మానసిక ప్రశాంతత



**బోథ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)**యోగా మన శరీరాన్ని ఆరోగ్యంగా, దృఢంగా, చురుకుగా ఉంచడంతో పాటు మనసుకు ప్రశాంతతను అందిస్తుందని యోగ శిక్షకురాలు మునిగెల యోగిత తెలిపారు.ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, శ్వాస నియంత్రణ మెరుగుపడతాయని తెలిపారు. శరీరంలో వశ్యత, సమతుల్యత పెరగడంతో పాటు మంచి నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు యోగా దోహదపడుతుందని పేర్కొన్నారు.ఆరోగ్య పాఠశాల--3 కార్యక్రమంలో భాగంగా కాగ్నిటివ్ ముద్రలను కొత్తగా చేర్చినట్లు యోగిత తెలిపారు. కాగ్నిటివ్ ముద్రను యోగా, ధ్యానంతో కలిపి సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి సహాయపడుతుందన్నారు. చదువుతున్న సమయంలో దృష్టిని కేంద్రీకరించుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, శ్రద్ధను మెరుగుపరుచుకోవడంలో ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత, చదువుపై ఆసక్తి పెంపొందించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల బోథ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు భోజన్న, నితిన్ ,సుధారాణి, హేమలత, కృష్ణ జ్యోతి, తిరుపతి రెడ్డి, పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ఇ

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**తాండూర్ ఆగస్టు 29 ప్రజాజ్యోతి** తాండూర్ మండలంలోని అచలాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం ఉమాదేవి మాట్లాడుతూ ధ్యాన్ చంద్ ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. పాఠశాల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడి సాంబమూర్తి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, సురేందర్, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఆటోమెటిక్ టైమర్ బెల్ అందజేత




**బోథ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)** మండలంలోని దన్నూరు బి ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన గిర్నూర్ రాజేశ్వర్ రెడ్డి ఆటోమెటిక్ టైమర్ బెల్ ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ ఇటువంటి పరికరాలతో సమయం ఆదాతో పాటుగా ఎంతో ఉపయోగకరం గా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా ముందుకు రావడం అభినందనీయమని ప్రశం సించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎల్మ వినయ్ రోహిణి రెడ్డి, ఉపాధ్యాయ బృందం, వార్డు మెంబర్, ఆసాల సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వైరు దొంగతనం



**ఖానాపూర్, ఆగస్టు 29 ( ప్రజా జ్యోతి )** : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం సమీపంలో గల రైతు జోగు రాజేశ్వర్ కు చెందిన పంట పొలం నుండి శనివారం పగలు దొంగలు విద్యుత్ వైర్‌ను దొంగలించారు. వ్యవసాయ బావిలో మోటార్ కు అమర్చిన విద్యుత్ వైర్ దాదాపు 30 మీటర్ల వరకు కట్ చేసుకొని పోయారు. దాదాపు 3 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. తాను మధ్యాహ్నం వరకు పొలం వద్దనే ఉండి, సాగు నీరు పెట్టానని, ఇంటికి భోజనం చేసి వచ్చే లోపు గుర్తు తెలియని వ్యక్తులు వైర్ కట్ చేసుకొని పోయారని తీవ్ర ఆవేదన చెందాడు

# మూడు దశాబ్దాల ప్రజాసేవకు అంతర్జాతీయ పట్టాభిషేకం

## .......పుదుచ్చేరి వేదికపై కేశెట్టి సంతోష్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్

## .......సేవా స్ఫూర్తికి ప్రపంచస్థాయి గుర్తింపు నేటి నుంచి డాక్టర్ సంతోష్ కుమార్

**తాండూరు ఆగస్టు 29: ప్రజాజ్యోతి** ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, గత మూడు దశాబ్దాలుగా నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాండూరు మండలం కి చెందిన యువకుడు అభినవ కల్చరల్ సోషల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లైక్ టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజ్మెంట్ సభ్యులు కేశెట్టి సంతోష్ కుమార్ (అభినవ సంతోష్ కుమార్) కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. శనివారం పుదుచ్చేరిలోని కంబన్ కలైయరంగం ఆడిటోరియంలో నిర్వహించిన సామాజిక నాయకులు--దార్శనికుల సమ్మేళనం--2026 కార్యక్రమంలో ఆయనకు సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కె. వెంకటేశన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.ఆర్. శంపత్, ఐఏఎస్, ప్రపంచ శాంతి సంస్థ, ఐక్యరాజ్యసమితి ప్రతినిధి, ప్రపంచ బౌద్ధ సమాఖ్య అధ్యక్షులు రాయబారి డాక్టర్ పర్విందర్ సింగ్, అంతర్జాతీయ న్యాయవాది డాక్టర్ కావేటి శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పి. అమృతవల్లి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కమిషనర్ డాక్టర్ కె. సుకుమార, చెన్నై మద్రాస్ హైకోర్టు గౌరవ మధ్యవర్తి డాక్టర్ ఎస్. సిద్ధార్థన్ గౌరవ అతిథులుగా కెనడాకు చెందిన న్యాయవాది కాలీసిస్ టెలెష్, అంతర్జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి చైర్మన్ డాక్టర్ సందీప్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జిల్లా కోర్టు మాజీ సహాయ న్యాయమూర్తి డాక్టర్ హరిదాస్, భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ హిందీ సలహా కమిటీ సభ్యులు, యూనివర్సిటీ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు చితిరాల, కర్ణాటక భారతీయ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు, యూనివర్సిటీ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ ఎం. రామచంద్ర తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

**ప్రజల కష్టాల్లో అండగా... సేవలో ముందంజగా**

కేశెట్టి సంతోష్ కుమార్ గత 30 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు వన్ ఇస్ నిర్వహిస్తూ ఇప్పటి వరకు 98 సార్లు రక్తదానం చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ తెలంగాణ గవర్నర్ నరసింహన్ చేతులమీదుగా ఉత్తమ రక్త దాత అవార్డ్ తీసుకున్నారు, పేదలకు సహాయ కార్యక్రమాలు, విద్యార్థుల కు ప్రోత్సాహం, పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు,



విద్యా సహాయం, వైద్య శిబిరాలు, ఉచిత వైద్య సహాయం, మహిళా సాధికారత, యువతలో సేవా దృక్పథం పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక అవగాహన, ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి, మజ్జిగ, మంచినీటి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పేదలు, వృద్ధులు, నిరుపేదల కు అన్నదానం వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయం లోనూ ప్రజలకు అండగా నిలిచి ఆహారం, నిత్యావసర సరుకులు, ఇతర అత్యవసర సహాయాలను అందించారు. గత 17 సంవత్సర ముగా పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి సంవత్సరం హరిత గణపతులు (మక్కా మట్టితో చేసిన మట్టి గణపతులు మొక్కలు) ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇస్తూ అన్నదానం, వైద్య సహాయం, రక్తదానం, విద్యా సహాయం, ప్రజా సంక్షేమ కార్యక్రమా ల్లో చురుకుగా పాల్గొంటున్నారు. యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ "సేవే లక్ష్యం... మానవత్వమే మార్గం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. "కష్టాలు... కన్నీళ్లు... ఎక్కడో... మా చేతులు అక్కడే" ఈ నినాదాన్ని తన సేవా జీవితానికి మార్గదర్శకంగా చేసుకున్న సంతోష్ కుమార్, ఎవరికైనా కష్టం వస్తే "నేనున్నాను" అంటూ ధైర్యం చెప్పడం,



ఇతరుల బాధను తన బాధ గా భావించి అండగా నిలవడం తన సేవా సిద్ధాంతంగా మార్చుకు న్నారు. అవార్డు కోసం సేవ చేయలేదు... సేవ చేసినందుకు అవార్డు వచ్చింది డబ్బుతో సంపాదించేది ఆస్తి... సేవతో సంపాదించేది ప్రజల గుండెల్లో స్థానం, మన కోసం జీవిస్తే జీవితం ఇతరుల కోసం జీవిస్తే చరిత్ర. ఒక్కరి కన్నీరు తుడవడం చిన్న సహాయం కాదు ఒక జీవితానికి ఆశను ఇవ్వడం అనే స్ఫూర్తిదాయక భావాలతో ఆయన సేవా ప్రస్థానం కొనసాగుతోంది. ఈ గౌరవం ఒక్కరి విజయం కాదు తనకు లభించిన గౌరవ డాక్టరేట్‌పై డాక్టర్ కేశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ గౌరవం తన ఒక్కరి విజయం కాదని అభినవ సంస్థ సభ్యులు, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, అధికారులు, అనధికారులు, మీడియా మిత్రులు, పాత్రికే యులు, తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అందరి సహకారం, ఆశీస్సుల ఫలితమేనని తెలిపారు. తన సేవా ప్రయాణంలో అడుగడుగునా తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గౌరవం పెరిగిన కొద్దీ బాధ్యత మరింత పెరుగు తుందని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. పుదుచ్చేరి వేదికపై ప్రముఖుల సమక్షంలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం కేశెట్టి సంతోష్ కుమార్ మూడు దశాబ్దాల నిస్వార్థ ప్రజాసేవకు లభించిన ప్రతిష్ఠాత్మక గుర్తింపుగా నిలిచింది. సేవే లక్ష్యం... మానవత్వమే మార్గం... ప్రజల ఆశీస్సులే నిజమైన పురస్కారం అని డా. అభినవ సంతోష్ కుమార్ తెలిపారు

# ప్రభుత్వ నిబంధన ప్రకారమే పనిచేస్తున్నాం ఎవరికి వత్తాసుగా లేము వద్దంటే పై అధికారుల సూచిస్తే వెళ్లిపోతాం

## మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ వెల్లడి

**ఖానాపూర్ ఆగస్టు 29 (ప్రజాజ్యోతి )** ప్రభుత్వ నిబంధన మేరకే ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎవరికి కి వత్తాసు లేకుండా విధులు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కౌన్సిలర్ సుందర్ సింగ్ అన్నారు పట్టణ కౌన్సిలర్లు అజెండాలో బదిలీ చేస్తాం అంటే పై అధికారుల సూచనల మేరకు వదులుకొని అవసరమైతే వెళ్లిపోవడానికి కూడా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు పాలకవర్గం కౌన్సిలర్ అంతా పార్టీలకతీతంగా మెలిగి పనులు తీర్మానిస్తే చేస్తాం ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయబోమని పట్టణ అభివృద్ధికి అందరు సహకరిస్తేనే జరుగుతుంది తప్ప తలో విధంగా వ్యవహరించి ఒత్తిడి తెస్తే జరగదని అన్నారు సిబ్బంది సైతం బెదిరిస్తున్నారని తమకు ఫిర్యాదు చేశారని పై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు పరిష్కరిస్తామన్నారు ప్రజా ప్రతినిధులుగా పట్టణ అభివృద్ధి పై బాధ్యత ఎంత ఉంటుందో సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులుగా మాకు కూడా అంతే బాధ్యత ఉంటుందని దీనికి సమన్వయం ఉంటేనే సాధ్యమవుతుందని అన్నారు పాలకవర్గ కౌన్సిలర్ల తుది నిర్ణయమే తమ నిర్ణయం అని సుందర్ సింగ్ వెల్లడించారు



# సాగునీటి విషయంలో బోథ్ కు తీవ్ర అన్యాయం



**బోథ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)**సాగునీటి విషయంలో బోథ్ నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నట్లుగా రైతుబంధు మాజీ అధ్యక్షుడు నల్ల జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 -26 సాగునీటి రంగానికి ఆర్థిక బడ్జెట్లో 23 వేల కోట్లు 2026- 27 బడ్జెట్లో 22 వేల కోట్లు కేటాయిస్తే అందులో ప్రత్యేకంగా అదిలా బాద్ జిల్లాకు కేటాయింపులు జరగలేదు పిప్పి రి తేజపూర్, బుగ్గారం లకి లిఫ్ట్ ఇరిగేషన్ల పేరిట 140 కోట్లు కేటాయించినప్పటికీ ఎక్కడ తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదు.గత ప్రభుత్వ హయాంలో బోథ్ మండలంలోని నారాయణ పూర్, అందూరు చెరువుల మంజూరు చేసినప్పటికి నేటి వరకు ఇప్పుడున్న ప్రభుత్వం లో బడ్జెట్ కేటాయింపులు జరగలేవు.గత ప్రభుత్వ హయాంలో బహుళార్థక ప్రాజెక్టుగా కడెం ప్రాజెక్టుకు కుప్టి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గా 5.50 టీఎంసీలతో 3.30 టీఎంసీలు లైవ్ స్టోరేజ్ గా 2 టీఎంసీలు డెడ్ స్టోరేజ్ గా జీవో నంబర్ 18, 34 జారీ చేస్తూ బడ్జెట్లో 750 కోట్ల నుంచి 800 కోట్ల వరకు కేటాయించడం జరిగింది అప్పుడు ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దివంగత మాజీ మంత్రి చిలుకూరి రామచంద్ర రెడ్డి , ప్రస్తుత ఆదిలాబాద్ డి సిసి అధ్యక్షులు జాదవ్ నరేష్ సామాజికవేత్త కౌట గ్రామ నివాసి రాజశేఖర్ రెడ్డి లు కుప్టి జలసాధన సమితి పేరుతో అఖిలపక్ష మీటింగ్ లో కరపత్రాలు పంచుతూ జీవో నెంబర్ 18 34 లను సవరించి ఇక్కడ లభ్యమయ్యే 8 టీఎంసీల మిగులు జలాలతో ప్రాజెక్టు పరిధిని పెంచుతూ కుడి ఎడమ కాలువలకు లిఫ్ట్ ఏర్పాటు చేసి కొంత గ్రావిటితో నీటిని ఆరు మండలాల పరిధిలోని 70 వేల ఎకరాల సాగుభూమికి నీరు అందివ్వాలని ప్రభుత్వం ముందు ఉంచుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 8 టీఎం సీలతో ప్రాజెక్టు నిర్మాణం చేపడుతామని ప్రజలను నమ్మించారుస్వయంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ప్రకటించి నేటికి మూడు సంవత్సరాలు కావస్తున్న ప్రాజెక్టుపై ఎటువంటి ముందడుగు పడలేదుమాటలు కోటలు దాటుతున్నాయి కానీ పనులు మాత్రం పనగడ దాటడం లేదు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొంద పెట్టడం ఖాయమని హెచ్చరించారు.

## మధురమైన భాష నా మాతృభాష

**--"దేశ భాషలందు తెలుగు లెస్స"**

**నేరడిగొండ, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):**"దేశ భాషలందు తెలుగు లెస్స" అంటూ తెలుగు భాష గొప్పతనాన్ని, మాధుర్యాన్ని, సొగసును చాటిచెప్పేలా కుమారి గ్రామానికి చెందిన రైతు కవి గడ్డం భీమ్ రెడ్డి చక్కటి కవితను రచించారు.అమ్మ ఒడిలో ఉగ్గుపాలతో నేర్చుకున్న భాష, ఇంటి బడిలో ఓనమాలు దిద్దుకున్న భాష తెలుగు అని కవి అభివర్ణించారు. అందమైన, అలరించే భాషగా, భాషలన్నింటిలోనూ భాసిల్లే భాషగా తెలుగును కొనియాడారు. పద విన్యాసాలు, అలంకారాలు, ఛందస్సులతో సొగసులు అద్దుకున్న తెలుగు భాష పద్య, గేయాలతో మనసును పరవశింపజేస్తుందని పేర్కొన్నారు."మధురమైన భాష.. నా మాతృభాష, దేశ భాషలందు తెలుగులెస్స.. నా ఇంటి భాష.. నన్ను కన్న భాష" అంటూ మాతృభాషపై తనకున్న అభిమానాన్ని కవి చాటుకున్నారు.



# విద్యార్థుల నైపుణ్యం వెలికి తీసేందుకు తెలుగు భాష క్రీడా దినోత్సవ ఉత్సవాలు హెచ్ఎం జాడి శ్రీనివాస్

**ఖానాపూర్ ఆగస్టు 29( ప్రజా జ్యోతి )** విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసేందుకే తెలుగు భాషతో పాటు క్రీడా దినోత్సవం నిర్వహించినట్లు ఖానాపూర్ మండలం మస్కాపూర్ పీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ అన్నారు శనివారం గిడుగు రామ్మూర్తి జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, హాకీ క్రీడాకారులు ధ్యాంచద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ తెలుగు క్రీడలకు సంబంధించిన ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు.విద్యార్థులు తమ సృజనాత్మకతను వెలికితీస్తూ తెలుగు భాష, సాహిత్యం, పదజాలం, క్రీడలు, క్రీడా విలువలు తదితర అంశాలపై ఆకర్షణీయమైన ప్రాజెక్టులను రూపొందించారు. ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టులను పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించి, వాటి గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ధ్యాంచద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ మాట్లాడుతూ,"పుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను ప్రాజెక్టుల రూపంలో స్వయంగా తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశీలన, విషయ పరిజ్ఞానం పెరుగుతాయి. తెలుగు భాషపై అభిమానం, క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి. విద్యార్థుల ప్రతిభను ప్రోత్స హించడం



పాఠశాల బాధ్యత." అని అన్నారు.తెలుగు ఉపాధ్యాయు లు వెన్నం అంజయ్య మాట్లాడుతూ,"తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులు ప్రాజెక్టుల ద్వారా సృజనాత్మకంగా ఆవిష్కరించడం అభినందనీయం. భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవితంలో భాగంగా చేసుకోవాలి." అని పేర్కొన్నారు.వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ,"క్రీడలు విద్యార్థులకు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేయడం, గెలుపోటములను సమానంగా స్వీకరించడం వంటి విలువలను నేర్పుతాయి. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో పాల్గొనాలి."అని సూచించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్, తెలుగు ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఇమ్రాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది.

# పాఠశాల స్థాయి జవాబు పత్రాలు బాహ్య మూల్యాంకనం

**పారదర్శకతకు వినూత్న ప్రయోగం**

**విద్యాశాఖ చరిత్రలో తొలి అధ్యాయం**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 29 ,( ప్రజాజ్యోతి ).** పాఠశాలలో నిర్వహించే హోం ఎగ్జామ్స్ ఎస్ ఎ 1, ఎస్ ఏ 2 పరీక్షల జవాబు పత్రాలు ఇకనుండి బాహ్య మూల్యాంకనం చేయనున్నారు. అదే పాఠశాలకు సంబంధించిన విషయ నిపుణులచే కాకుండా ఇతర పాఠశాలలకు చెందిన విషయ నిపుణులు ఈ పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు .ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్ సి నెంబర్ 7002- 2 ,ఈ వి ఎల్ / ఎస్ సిఈఆర్టి / టి జి 2026తో ఉత్తర్వులను జారీ చేసింది. పాఠశాల గుణాత్మక విద్యను మరింత పెంచడానికి ప్రశ్నపత్రాల మూల్యాంకనంలో పారదర్శకతను పాటించడానికి జవాబు పత్రాలను బాహ్య మూల్యాంకనం చేయించాలని నిర్ణయించింది. పాఠశాల స్థాయిలో నిర్వహించే ప్రాథమిక ఉన్నత తరగతుల ఎస్ఏ 1 ,ఎస్ఏ2 జవాబు జవాబు పత్రాలను పరీక్ష జరిగిన వెంటనే సురక్షితంగా కవర్లలో సీల్ చేసి సమీప మండల కేంద్రంలో సమర్పించాలి. అన్ని సబ్జెక్టుల వారిగాజవాబు పత్రాలను వెంట వెంటనే ఎంఆర్సికి తరలించాలి .ఆయా మండల విద్యాధికారులు మూల్యాంకణానికి తగిన ఏర్పాట్లను చేసుకోవాలని సూచించింది. మండలంలోని సీనియర్ ఉపాధ్యాయులను విషయాల వారీగా మూల్యాంకణానికి ఎంపిక చేసుకోవాలని పేర్కొంది. జవాబు పత్రాల మూల్యాంకణానికి గాను ప్రాథమిక స్థాయి జవాబు పత్రాలకు ఒక్కొక్క దానికి రూపాయిలు 2 ,ఉన్నత పాఠశాలకు సంబంధించిన జవాబు పత్రాలకు రూపాయలు 3, చెల్లించాలని తెలిపారు. జవాబు పత్రాల మార్కుల జాబితా రూపొందించి, అదే రోజు ఆన్లైన్ ఎంట్రీ పూర్తి చేయాలని అధికారులు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడానికి సమాయత్తమవ్వాలని పేర్కొన్నారు .దీనికి సంబంధించి ఒక ప్రణాళికను సిద్ధం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డి ఈ ఓ లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ విద్యాశాఖ చరిత్రలోనే తొలి అధ్యాయంగా నిలవనుంది.

**మంచి పరిణామం ఇందూర్తి హేమ లత. ఉపాధ్యాయురాలు.**

జవాబు పత్రాలను అదే పాఠశాలల ఉపాధ్యాయులు కాకుండా ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయడం మంచి పరిణామం మూల్యాంకనంలో పారదర్శకతతో పాటు గుణాత్మకమైనటువంటి ఫలితాలు అందజేయడంలో ఈ ప్రక్రియ తోడ్పడనుంది ఉపాధ్యాయులంతా దీనిని స్వాగతిస్తున్నారు

**ఆమోదయోగ్యమే ఉపాధ్యాయుడు ఇందూర్తి శ్రీ నివాస చార్యులు.స్కూల్ అసిస్టెంట్ గణితం.**

పాఠశాల స్థాయి జవాబు పత్రాలు ఇతర ఉపాధ్యాయులచే మూల్యాంకనం చేయించడం స్వాగతించాల్సిన విషయం పిల్లల అభ్యాసన స్థాయి పారదర్శకమైన ఫలితాలు అందించడానికి అనుకూలమవుతుంది పదవ తరగతి పరీక్షల సన్నాహానికి విద్యార్థులకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది

## ఇంద్రవెల్లి సాక్షిగా తుడుందెబ్బ యుద్ధం మొదలు అయింది

**రాష్ట్ర వ్యాప్త ఐటీడీఏ కేంద్రాలలో ఆదివాసీ మార్చ్ వేలాదిగా కదిలిరండి**

**తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.అరుణ్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్కు బాబురావు**





**ఆదిలాబాద్ బ్యూరో, ఆగష్టు 29, (ప్రజా జ్యోతి)** ఆదివాసి గిరిజనులు తమ సమస్యల సాదన కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు కార్యచరణను రూపొందించారు. శాంతి యుత పోరాటం ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి పెంచే విదంగా ఉ ద్యమం చేపట్టేందుకు సిద్ధ మయ్యారు. ఈ ఉద్యమంలో ప్రతీ ఆదివాసీ గిరిజనుడు పాల్గొని తన గోడు, డిమాండ్ వినిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఐటీడీఏ కేంద్రాలలో బారి "ఆదివాసి మార్చ్" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కరపత్రం, పోస్టర్ లనుఇంద్రవెల్లి అమరుల స్థూపం ప్రాంగణంలో ఆవిష్కరించారు. సెప్టెంబర్ - 7 ఏటూరు నాగారం, సెప్టెంబర్ 16 ఉట్నూర్, సెప్టెంబర్ - 21 భద్రాచలం, సెప్టెంబర్ - 28 మన్ననూరు ఐటిడిఎ కేంద్రాలలో అధివాసిల మార్చ్‌ల నిర్వహణ చే యనున్న ట్లు తుడుందెబ్బ తెలిపింది. ఈ కార్య క్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్ద బోయిన లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు పెందూరూ దాధిరావ్, రగల్ జెండా చై ర్మన్ మెస్రం నాగ్ నాథ్, ప్రధాన కార్యదర్శి పురక చిత్రులు హాజరయ్యారు. అ నంతరం డా.అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీల మనుగడ దినదిన గండంగా మారింది అని ఎన్ని ర్యాలీలు బహిరంగ సభలు నిర్వహణ చేసి ఆదివా సీల సమస్యలను విన్నవించినా కానీ రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా వ్యవహరిస్తుంది అని అన్నారు. అందుకే పోరాటాలు ఉధృతం చేయటం కోసం రాష్ట్ర వ్యాప్త ఉ ద్యమాలకు పిలుపు ఇచ్చాం అన్నారు. 1976 నుండి 20 26 వరకు 50 ఏళ్లగా ఆది వాసీల రిజర్వేషన్ లను దో చుకుంటున్న లంబాడిలను ఎస్టీల నుండి తొలగించటం కోసం ప్రత్యేక కమిషన్ ను నియమించాలని "5" వ షె డ్యూల్ ప్రాంత ఉద్యోగాల లో 29 శాఖల జీవోలను ట్రై బల్ అడ్వైసరి కమిటీ (టిఏ సి ) తీర్మానం ద్వారా ప్రత్యేక చట్టం చేయాలని, ఐటీడీఏ ద్వార నే ఉద్యోగాల బర్తీ ప్రక్రియ, ప్రమోషన్ లు బదిలీలు చేయాలనీ, కానిస్టేబు ల్ ఉద్యోగాలలో 75 పర్సం ట్ వాటా, ఏజెన్సీ డిఎస్సి ఏ ర్పాటు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరి వికాస్ బోర్లు దింపాలనీ, గోదా వరి నది పై కట్టిన ప్రాజెక్టులలో తుపాకుల గూడెం, దేవాదుల కాళేశ్వరం నుండి ఆది వాసీ ప్రాంత రైతులకు సాగు నీరు ఇవ్వాలని, బిటిపిఎస్, కెటిపిఎస్, బిపిఎల్, దేవా పూర్ సిమెంట్ ఫ్యాక్టరీలో సింగరేణి లలో అధివాసిల వాట, ఉద్యోగాల వాట, తదితర డిమాండ్ లతో ఈ మార్చ్‌ల నిర్వహణ చేస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఏఎస్ యు కార్య నిర్వాహక అధ్యక్షులు కనక గణేష్, తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు మెస్రం జైరాం, విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు గేడం లాలు ప్రసాద్, తుడుం దెబ్బ మండలం కార్యనిర్వాహనా అధ్యక్షులు కుర్సెంగ రాందాస్, తుడుం దెబ్బ మండల ప్రదాన అధ్యక్షులు మెస్రం సందీప్, పెందుర్ క్రిష్ణ, పూర్కు నగేష్, మెస్రం మోతిరం, కనక రాందాస్, గేడం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## వేదం పాఠశాలను సందర్శించిన డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్



**బోథ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)** రెండు రోజుల క్రితం వేదం పాఠశాలలో జరిగిన సంఘటన గురించి సమాచారం అందుకున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ వారు పాఠశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు జరిగిన సంఘటన గురించి వివరాలు తెలుసుకొని పై అధికారులకు నివేదిక అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ సతీష్ పాఠశాలలోని ఉపాధ్యాయులకు ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కార్పొరల్ పనిష్మెంట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా పిల్లలకు వారి హక్కుల గురించి చైల్డ్ హెల్ప్ లైన్ సేవల గురించి వివరించారు మరియు పిల్లలకు ఎటువంటి సమస్యలు ఉన్న చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 కాల్ చేయాలని తెలియ జేయడం జరిగింది.

## ఓటర్లకు త్వరగా హియరింగ్ నోటీసులు అందించాలి

**రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి**




**ఆసిఫాబాద్ ఆగష్టు 29 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ (లోపాలున్న) జాబితాలో నమోదైన ఓటర్లకు త్వరితగతిన హియరింగ్ నోటీసులు జారీ చేసి, అవసరమైన ధ్రువపత్రాలు స్వీకరించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. బీఎల్ఓలు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు నోటీసులు అందజేసి, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. నోటీసుల అందజేతకు, విచారణ (హియరింగ్) ప్రక్రియకు మధ్య తగిన గడువు ఉండాలన్నారు. ప్రతివారం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 1.05 లక్షల మందికి నోటీసులు: కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ.. జిల్లాలో మ్యాపింగ్ కాని, లోపాలున్న 1,05,829 మంది ఓటర్లకు నోటీసులు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 8,098 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. బీఎల్ఓలు గ్రామ పంచాయతీ కార్యాలయాలలో విచారణ చేపట్టి, స్వీకరించిన ధ్రువపత్రాల వివరాలను 'బీఎల్ఓ యాప్'లో నమోదు చేస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ లోకేశ్వర్ రావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## తీజ్ పండుగ బంజారా సంస్కృతికి ప్రతీక

**-లింభాజీ మహారాజ్**



**బోథ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి)** తీజ్ పల్లె ప్రకృతి పండుగ బంజారా సంస్కృతికి ప్రతీక అని లింభాజీ మహారాజ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా మండలంలోని కైలాస్ టేకిడి లో గల గోశాల వద్ద లంబాడీల పండగలలో ముఖ్యమైన పండగ తీజ్ పండగ ను పురస్కరించుకొని మొదటి రోజు ఆయన ఆధ్వర్యంలో లంబాడీల సంస్కృతి ఆచారాల ప్రకారంగా ఆడపడుచులు సంత్ లింభాజీ మహారాజు సతీమణి సమేతంగా పుట్ట మట్టిని సేకరించి ఆ మట్టిని ప్రత్యేకమైన బుట్టలను తయారు చేసి అందులో మట్టి వేసి ఆ మట్టిలో గోధుమలను వేస్తూ పాటలను పాడుతూ ఆ బుట్టలను ఒక ప్రత్యేకమైన స్థలంలో ఉంచి 9 రోజుల వరకు ఉపవాస దీక్షతో పాటలు పాడుతూ సమీపములోని వాగులో నుండి తెచ్చిన నీటిని చల్లుతూ తొమ్మిదవ రోజు అయిన ఆఖరి రోజున ఆ బుట్టలో పెరిగిన గోధుమను ప్రత్యేకంగా పూజలు చేసి ఆడపడుచులు కోరిన కోరికలు నెరవేరాలని మొక్కులు చెల్లించుకున్నారు. వాటిని తుంచి సామూహికంగా భాజా భజంత్రీలతో సాంప్రదాయ శ్రీ నృత్యాలతో సమీపంలోని గంగసాగర్ అనే కోనేరు వద్ద వాటికి సంత్ లింభాజీ మహారాజ్ సతీమణి శోభా భాయి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకోనేరులో నిమజ్జనం నిర్వహించనున్నారు.

## జాతీయస్థాయిలో పథకాలు సాధించడం జిల్లాకే గర్వకారణం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**జిల్లాలో ఘనంగా జాతీయ క్రీడ దినోత్సవ వేడుకలు**



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 29 (ప్రజా జ్యోతి )** క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జాతీయ క్రీడాదినో త్సవం, మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మున్సి పల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం క్రీడాజ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ, జిల్లాలో ఆదిలా బాద్, జైనథ్, ఐటిడి ఎస్పోర్ట్స్ పాఠశాలలు విద్యతో పాటు క్రీడల్లో నూ రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పథకాలు సాధించడం గర్వకారణమన్నారు. క్రీడాకారుల ప్రగతికి అవసరమైన మౌలిక వసతులు, కోచ్‌లు, ఫ్రిన్సిపాల్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జూడో, హాకీ తదితర విభాగాలలో జిల్లా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని భరోసా కల్పించారు.అనంతరం జిల్లాలోని పలువురు పూర్వ క్రీడాకారులను శాలువాలతో సత్కరించి, మెమెం టోలను అందజేశారు ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ దయానంద్ రెడ్డి,ప్రముఖ క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆధార్ అప్‌డేట్, డ్రాప్ అవుట్ నివారణ, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి





**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు**

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 29 (ప్రజా జ్యోతి )** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరు గుపరిచేందుకు సమగ్ర ప్రణా ళికతో పనిచేయాలని ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్‌లో నిర్వ హించిన సమావేశంలో సమగ్ర గిరిజన అభి వృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారు లను ఆదేశించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల సమీక్షా సమావేశం లో గిరిజన ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షకులు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు (డిటిడబ్ల్యుఓలు), ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు, హెచ్‌డబ్ల్యూఓల తో కలిసి విద్యార్థుల ఆధార్ అప్‌డేట్, డ్రాప్‌అవుట్ పరిస్థితి, విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు తదితర అంశాలపై పీవో సుదీ ర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడు తూ ప్రతి విద్యార్థి ఆధార్ వివరాలు త ప్పనిసరిగా అప్‌డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ డ్రాప్ అవుట్ కు కారణాలను గుర్తించి, విద్యార్థులు పాఠశాలలకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు.విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించే విధంగా బోధనా పద్ధ తులను మెరుగుపరచాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా సులభమైన బోధనా విధానాలను అవలంబిస్తూ, వారి మాట్లాడే, చదివే, రాసే సామర్థ్యాలను పెం పొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అన్ని విభాగాల అధికారులు, పాఠశాలల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పీవో సూచించారు. ప్రతి సమీక్షా సమావేశానికి అధికారులు ముందుగానే పూర్తి సమాచారాన్ని సేకరించి, ఖచ్చితమై న కార్యాచరణ ప్రణాళికతో హాజరు కావాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో విద్యాప రిస్థితులు, విద్యార్థుల హాజ రు, డ్రాప్‌అవుట్, బోధనా ప్ర మాణాలు తదితర అంశాల ను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి నెల 26వ తేదీన పాఠశాల స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో గుర్తించిన సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాలను రూపొందించి, తదుపరి సమావేశంలో పురోగతిని సమీక్షించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన బోధనా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్య తాయుతంగా పనిచేయాలని ప్రాజెక్టు అధికారి మంద మకరందు సూచించారు.

# బీసీల గొంతు నొక్కుతున్న కేంద్ర గెజిట్ నోటిఫికేషన్




## జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 29, (ప్రజా జ్యోతి )** కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం దేశవ్యాప్తంగా నిర్వ హించ తలపెట్టిన జనగణన 2027 గెజిట్ నోటిఫికేషన్ లో వెనుకబడిన తరగతుల (బీసీల) పొట్ట కొట్టేలా వ్యవ హరించిందని యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్ ఆందో ళన వ్యక్తం చేశారు. పార్ల మెంట్‌లో బీసీ కులగణన చేపడతామని మాట ఇచ్చి, ఇప్పుడు గెజిట్ నోటిఫికేష న్ ద్వారా కేంద్రం వెన్నుపోటు పొడిచిందని ఆయన మండి పడ్డారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రతి ఇంటికి వెళ్లి వివ రాలు సేకరించ డానికి 40 ప్రశ్నలతో కూడిన ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులోని 10వ ప్రశ్నలో కేవలం షెడ్యూల్డ్ కులం (ఎస్సీ) షెడ్యూల్డ్ తెగ(ఎస్టీ), ఇతరకులాలు (క్యాస్ట్) అని మాత్రమే ఇచ్చారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీ, బీసీల కోసం ప్ర త్యేకంగా ఎలాంటి కాలమ్ లేదా ఆప్షన్‌ను కేటాయించ లేదు.ఏ కులం జనాభా ఎంతో తెలియనప్పుడు, ప్రభుత్వాలు బడ్జెట్ లో బీసీ సంక్షే మానికి సరైన నిధులు కేటాయించలేవు. ఉద్యోగ, విద్యా అవకాశాల కోత ఏర్పడే ప్రమాదం ఉందని,సరైన లెక్కలు లేకపోతే భవిష్యత్తులో బీసీ బిడ్డల చదువులకు, ఉద్యోగాలకు ఇచ్చే రిజర్వేషన్లు ప్రమాదంలో పడతాయి అని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ గ్రామంలో, ఏమండలంలో ఎంత మంది బీసీలు ఉన్నారో డిజిటల్ రికార్డు లేకపోతే వారికి దక్కాల్సిన సీట్లు దక్కవు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే గె జిట్‌ను సవరించాలని అని ఆయన కోరారు. తెలంగాణ, బీహార్ రాష్ట్రాల తరహాలో కేంద్రం కూడా ప్రతి బీసీ కులానికి ఒక ప్రత్యేక కోడ్ నంబర్ ఇవ్వాలని శ్రీకర్ గౌడ్ డిమాండ్ చేశారు. డిజిటల్ పద్ధతిలో బీసీల కచ్చితమైన వివరాలు సేకరించకపోతే, బీసీల అభ్యున్నతి మరు గున పడేలా ఉందన్నారు. రాహుల్ గాంధీ నాయక త్వంలో కాంగ్రెస్ పార్టీ ఎల్ల ప్పుడూ బీసీల హక్కుల కో సం పోరాడుతుందని కేంద్రం తక్షణమే గెజిట్ నోటిఫికేష న్‌ను సవరించి ఓబీసీ కాల మ్ ను చేర్చకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీసీలను ఏకం చేసి, తమ ఉద్యమాలు కొన సాగుతాయని శ్రీకర్ గౌడ్ హె చ్చరించారు.

# బినామీ బిల్లులు అధికారులపై జులూమ్, సహించేది లేదు కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆరోపణ



**ఖానాపూర్ ఆగస్టు 29( ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నెలవారి సాధారణ మున్సిపల్ సమావేశంలో బినామి బిల్లులు ప్రవేశపెడితే సహించేది లేదని అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు విలేకరుల సమావేశంలో ఆరోపించారు శనివారం 11 గంటల 30 నిమిషాలకు జరగాల్సిన సమావేశం కు సమయానుకూలంగా రాకుండా కాలయాపన చేసి అలస్యంగా వచ్చినందుకు అరగంట చూసి వాయిదా వేయడం ప్రభుత్వ నిబంధనని తాము దాన్ని అమలు పరచామని కాంగ్రెస్ కౌన్సిలర్ తరపున 11వ వార్డు కౌన్సిలర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం విలేకరులతో స్పష్టం చేశారు లేటుగా వచ్చిన బిజెపి బిఆర్ఎస్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు కమిషనర్లు అధికారుల పట్ల దూరుసుగా వ్యవహరించి చైర్మన్ భర్త తిరిగి సమావేశం ఒంటిగంటకు ఏర్పాటు చేశారని దానికి పట్టణ ప్రజాప్రతినిధులుగా వాయిదా వేసిన 24గంటల లోపు తిరిగి సమావేశం ఏర్పాటు చేసుకోవడం నిబంధన మేరకు తాము కూడా అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు హాజరైనామని అన్నారు అయితే నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారితిన ఎజెండా తయారుచేసి సమావేశంలో ప్రవేశపడితే తాము ఉల్లంఘించామే తప్ప అభివృద్ధి నిరోధకులను కామని వెల్లడించారు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు పక్క నియోజకవర్గ నిర్మల్ బిజెపి ఎమ్మెల్యే అసెంబ్లీ ప్రతిపక్ష నాయకులు మహేశ్వర్ రెడ్డిని ఏకపక్షంగా స్థానిక ఎమ్మెల్యే, బి ఆర్ఎస్ కాంగ్రెస్ కౌన్సిలర్లను పిలువకుండా అట్టఅ సంగా ప్రమాణ స్వీకారం చేసిన ఖర్చులు అజెండాలో చేర్చడం ప్రజా సంక్షేమ నిదులు అపహరించడమే నన్న ధోరణిలో ఆఖర్చులకు వ్యతిరేకంగా తీర్మానాన్ని వృతి రే కించమన్నారు పార్టీల కతీతంగా బిఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం మద్దతు పలికి ఆ ఖర్చును వెనక్కి తీసుకునేలా చేశామని ఉద్ఘాటించారు అదేవిధంగా పర్యావరణ పచ్చదనం కార్యక్రమం కింద 2 లక్షల తీర్మానం చేస్తే దాన్ని 1లక్ష రూపాయలకు కుదించి తిరిగి మరో 1లక్ష పట్టణ అభివృద్ధికి కేటాయించాలని వ్యతిరేకించామని అన్నారు ఉచితనీటి సరఫరా ట్యాంకును సైతం సొంతంగా సరాపర చేస్తున్నట్లు చైర్మన్ ఫోటోతో బ్యానర్ కట్టి సరాపర చేస్తే అది వ్యక్తిగతంగా ఉచితంగా ఇచ్చారని అనుకున్నామని దాన్ని తిరిగి ఎజెండాలో ఖర్చులపై చేర్చడం అన్యాయం అన్నారు స్థానిక ఎమ్మెల్యే ఫోటోతో పాటు పార్టీలకతీతంగా అందరు కౌన్సిలర్ల ఫోటోలు ఆ బ్యానర్ లో పెట్టినట్లయితే అది సమతూకం అవుతుంది.ఒంటెద్దు పోకడగా ఇష్టారితిన బ్యానర్ చైర్మన్ ఫోటోఏర్పాటు వ్యాన్ పై చేయడం వలన తప్పుపట్టామని అలాగే పట్టణంలో గుంతలు పడ్డ రోడ్డు ప్యాచ్ వర్క్ లు సొంతంగా చేయిస్తామని తెలిపి చైర్మన్ తిరిగి ఈ రెండు పద్దతులు ఎజెండాలో చేర్చడం వ్యతిరేకించా మన్నారు భవిష్యత్తులో అందరి కౌన్సిలర్లను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తే కలిసి పని చేస్తాం తప్ప అధికారులను భయభ్రాంతులకు గురిచేసి ఇష్టారితిన వ్యవరిస్తే సహించేది లేదని కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజు రా సత్యం నిమ్మల రమేష్,గౌరె తిరుమల,సాజిదా బేగం మేష పోసవ్వ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌరె గంగాధర్ నాయకులుమేష సతీష్ లు విలేకరులతో అన్నారు

# ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి





## అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఆదేశం

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 29, (ప్రజా జ్యోతి )** ఓటర్ల జాబితా పరిశీలన, స వరణ, నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియలను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి తొలగింపున కు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుద ర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ఎన్నికల విభాగం అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఓటర్లకు జారీ చేసే నోటీసులను సంబంధిత వ్యక్తులకు మాత్రమే స్వ యంగా అందజే యాలని సూచించారు. బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులను ఈఆర్‌ఓలు, ఏ ఈ ఆర్ ఓలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు తమ వివరణ ఇచ్చేందుకు, అవసరమైన ధ్రువ పత్రాలను సమర్పించేం దుకు ఏడు రోజుల గడువు ఇవ్వాలని తెలిపారు. హియరింగ్ తేదీ, సమయం తదితర వివరాలను ముందుగానే సంబంధిత ఓటర్లకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి లేదా ఆధార్ కార్డు సమర్పిస్తే సరిపోతుందనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించినప్పటికీ నో- మ్యాపింగ్ జాబితాలో ఓ టర్లు ఉండటానికి గల కార ణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఇలాంటి కేసులనుత్వరితగతిన పరిష్కరించి, అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యే లా చర్యలు తీసుకోవాలన్నారు.ఓటర్ల జాబితాలో గుర్తించిన లోపాలు,నో-మ్యాపింగ్ వివరాలను ఎన్నికల నిబం ధనల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతిని ధులతో పంచుకోవాలని తెలిపారు. మొత్తం ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతా నికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఓ టర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అధికారి బాధ్య తాయుతంగా, సమన్వయం తో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ఓ టర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, ఈఆర్ ఓలు, ఏఈఆర్‌ఓలు, రెవెన్యూ, ఎన్నికల విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# వేగవంతంగా గోదావరి పుష్కర పనులు పూర్తి చేస్తాం

## కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 29 ,( ప్రజాజ్యోతి ).**

వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నిర్మల్ జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ ల వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామ య్యర్, కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన పనులను త్వరగా ప్రారంభించాలని అన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలన్నారు కలెక్టర్లు పుష్క రాల పనులన్నీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నివేదికలు సమర్పించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడు తూ, నిర్మల్ జిల్లాలోని బాసర పుష్కర క్షేత్రం వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దేవాదాయ, నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నా మని అన్నారు. వీటితో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక అన్ని పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ. ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## పింఛన్ అర్హులు 31 లోగా దరఖాస్తు చేసుకోవాలి



ఎంపీడీవో రాథోడ్ రాధా

**ఖానాపూర్ ఆగస్టు 29 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 31 చివరి రోజు అని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఖానాపూర్ మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి రాథోడ్ రాధా ఒక ప్రకటనలో తెలిపారు అర్హులైన లబ్ధిదారులలో ఇంకా దరఖాస్తు సమర్పించని వాళ్లు వెంటనే దరఖాస్తు ఫారాలు సమర్పించాలన్నారు గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులు తీసుకోబడవని ఆన్లైన్లో పరిగణించబడవని రాదా అన్నారు విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ఏ ఒక్కరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా మండ లంలోని ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ చేయుత పెన్షన్లు ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తి కాకపోతే, వీలైనంత త్వరగా ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేయించేలా గ్రామపంచాయతీ సర్పంచులు ప్రజాప్రతినిధులు పంచాయతీ అధికారులు కార్యదర్శులు త్వరిత గతినచర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాథోడ్ రాధా కోరారు

## ఎఫ్ఎల్ఎన్ ను బాధ్యతగా అమలు పరచాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 29,( ప్రజా జ్యోతి )** తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమ అమలులో భాగంగా విద్యార్థులలో ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను మరింత పటిష్టం చేయాలని జి ల్లా కలెక్టర్ రాజర్షిషా ఉపా ధ్యాయులను ఆదేశించారు. శనివారం స్థానిక టీటీడీసీ లో ఆయన అధ్యక్షతన జి ల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా తెలుగు, గణితం, ఇంగ్లీష్ విషయాల్లో విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని, వివిధ గ్రేడ్‌ల వారీగా వారి అభ్యసన స్థాయిలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలిం చారు. ఆగస్టు నెలలో ఎంఈ వోలు, కాంప్లెక్స్ హెచ్ ఎంలు నిర్వహించిన పాఠ శాలల తనిఖీ నివేదికలపై సుదీర్ఘంగా సమీక్ష జరిపి పలుకీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తొలి మెట్టు అమలు మార్గదర్శకా ల ప్రకారం ప్రతి నెల క్రమం తప్పకుండా పాఠశాల స్థా యి (25న), మండల స్థాయి (26న), జిల్లా స్థాయి (27న) జరగాలని ఆదేశించారు. బోధనను మరింత ఆకర్షణీ యంగా, సులభంగా మార్చడంలో బోధనా అభ్యసన సామాగ్రి కీలకమని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సృ జనాత్మకతకు పదును పెట్టే లా సెప్టెంబర్ 15 నుండి 19 వరకు మండల స్థాయిలో 'టీఎల్ఎం మేళాలు' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల స్థాయిలో ఎం పికైన ఉత్తమ ప్రదర్శనలతో సెప్టెంబర్ 22న జిల్లా స్థాయి మెగా 'టీఎల్ఎం మేళా'ను నిర్వహించనున్నట్లు ప్రకటిం చారు. పాధ్యాయులందరూ నాణ్యమైన టీఎల్ఎంను సిద్ధం చేసి జిల్లా స్థాయి మేళాలో విజయవంతంగా ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా ఆగస్టు నెలలో ఉత్తమ బోధన సామర్థ్యాల ప్రదర్శనకు గాను బోథ్ మండలం కంటేగాం ఎంపీపీఎస్ ప్రధానోపా ధ్యాయుడు గోవింద్‌కు ప్రశంస పత్రాన్ని కలెక్టర్ అందజేసి, ఎఫ్ ఎల్ ఎన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అకడమిక్ కోఆర్డినేటర్ల కృష్ణ, మండలాల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కాంపిటెంట్ పాఠశాలల హెడ్ మాస్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికలు సజావుగా నిర్వహించండి

## కలెక్టర్ కు బిజెపి నేతల వినతి

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 29, (ప్రజా జ్యోతి )** ఈనెల 31న జరిగే అదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని బిజెపి నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. గతంలో తమకు మెజార్టీ ఉన్నాకూడా వాళ్లలో వాళ్లు గొడవ చేసు కొని సమావేశాన్ని వాయిదా వేశారు కానీ ప్రతి నెల సమావేశాన్ని ఏ గొడవ లేకుండానే నిర్వహిస్తున్నారని, చైర్మన్ కోర్టుకు తప్పుడు సమా చారం ఇచ్చి ఆమె యొక్క పవర్స్ని ఇన్సిట్యూట్ చే స్తున్నారని అన్నారు. కావున ఈసారి కచ్చితంగా ఎన్ని కలు జరపాలని, దీనికి అడిషనల్



కలెక్టర్ని నియమించాలని, సమావేశాన్ని లైవ్ ఇవ్వాల్సిందిగా కలెక్టర్ కి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

# ఆదివాసీ ముద్దుబిడ్డ భీమ్రావు సేవలు చిరస్మరణీయం

**ఆసిఫాబాద్ ఆగష్టు 29 ప్రజా జ్యోతి** గిరిజన ముద్దుబిడ్డ, ఆదివాసీ తొలి పట్టభద్రుడు, మాజీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి స్వర్గీయ కోట్నాక భీమ్రావు 24వ వర్ధంతి వేడుకలు జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక కోట్నాక భీమ్రావు చిల్డ్రన్ పార్క్లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన తండ్రి భీమ్రావు విగ్రహానికి నివాళులర్పిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి చూపిన బాటలోనే పయనిస్తూ ఆదివాసీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ఆయన ఆశయ సాధనే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. సమాజ అభ్యున్నతికి, ప్రజాసేవకు భీమ్రావు చేసిన కృషి



చిరస్మరణీయమన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, భీమ్రావు కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

సెప్టెంబర్ 7న మహాధర్నా నిర్వహిస్తాం

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షులు

మంచర్ల సదానందం

**మంచిర్యాల, 29, ఆగష్టు (ప్రజాజ్యోతి):** పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మంచర్ల సదానందం డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఫీజు రీయింబర్స్మెంట్ ఉద్యమంపై కార్యాచరణను రూపొందించారు. ఈ సందర్భంగా మంచర్ల సదానందం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సుమారు 30 లక్షల మంది పేద విద్యార్థులకు సంబంధించిన రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు కాలేజీలను మానేస్తున్నారని, చదువు పూర్తయిన విద్యార్థులకు సైతం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడటమే కాకుండా విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ ముఖ్యమైన సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 31న జిల్లా కలెక్టర్, ఎంఆర్ఓలకు వినతిపత్రాలు అందజేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు మంచర్ల సదానందం తెలిపారు. వారం రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 7న మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మహాధర్నాకు పెద్ద సంఖ్యలో విద్యార్థులను, విద్యాసంస్థల యాజమాన్యాలను భాగస్వామ్యం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ సమస్యను పరిష్కరించే వరకు విద్యార్థుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీతో పాటు ధర్మసమాజ్ పార్టీ కూడా విద్యార్థుల సమస్యపై ఉద్యమానికి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఏదినూరి రమేష్, జిల్లా నాయకులు నందిపాటి రాజు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు మేడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 29, (ప్రజా జ్యోతి)** విద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పోష కాహార లోపం నివారణకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థు లకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. శనివారం స్థానిక భుక్తాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్య క్రమంతో పాటు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కంటి అద్దాల పంపిణీ కార్య క్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ శాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తదితర పోషకాహారాన్ని తమఆహారంలో భాగంగా చేసు కోవాలని అన్నారు. శరీర సాధారణ పనితీరు మెరుగ్గా ఉండేందుకు ప్రతిరోజూ తగినంత నీరు తాగడం కూడా చాలా అవసరమని తెలిపారు. ప్రస్తుత డిజిటల్యుగంలో విద్యార్థులు ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరిమితంగా ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. చిన్న వయస్సులోనే మొబైల్ ఫోన్లు, టీవీలకు అధికంగా అలవాటు పడటం ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. అధిక స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల నిద్ర, ఏకాగ్రత, శారీరక చురుకుదనం వంటి అంశాలపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని, విద్యార్థులు చదువు, క్రీడలు, పుస్తక పఠనం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కంటి సమస్యలు ఉన్న విద్యా ర్థులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా కంటి అద్దాలు ధరించాలని కలెక్టర్ సూచించారు. కంటి చూపు సంబంధిత సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చని తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల సం క్షేమం, భద్రతకు సంబంధించిన సమస్యలను తెలియ జేసేందుకు ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్సులను విద్యా ర్థులు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. త మకు ఎదురయ్యే సమస్య లను ఉపాధ్యాయుల దృష్టి కి తీసుకురావాలని అన్నా రు.ప్రస్తుత పాఠశాల భవనం పురాతనంగా మారినందున నూతన భవన నిర్మాణానికి సుమారు రూ.4 నుంచి రూ. 5 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పా ఠశాలను తాత్కాలికంగా డీ సీ ఈ బీ కార్యాలయ భవనంలోకి తరలిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల కు మెరుగైన విద్యా వాతావ రణం కల్పించేందుకు అవ స రమైన చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. అంతకుముందు ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కు ఆరోగ్యం, వ్యక్తిగత పరి శుభ్రత, పోషకాహారం, కంటి సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఎంహెచ్ఓ డా. సాధన, స్థానిక కౌన్సిలర్ ప్రకాష్, వైద్యులు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రమేష్ రెడ్డి, డీబీసీఓ కృష్ణ, ఆర్బీఎస్కే వైద్య సిబ్బంది, ఉపాధ్య యులు, విద్యార్థులు తది తరులు పాల్గొన్నారు.

## మర్తిడి గ్రామంలో కార్డెన్ సర్చ్.....



**బెజ్జూర్ ఆగష్టు 29(ప్రజాజ్యోతి):** మండలంలోని మర్తిడి గ్రామం లో. ఎస్సై సర్తాజ్ పాషా ఆధ్వర్యంలో, బెజ్జూర్ పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి, వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది. అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన గుడుంబా పానకం మరియు బెల్లం నీటిని ధ్వంసం చేయడంచేశారు.గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలు మరియు రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు

## ఎమ్మెల్సీ దండే విఠల్‌కు రాఖీ కట్టిన ఆత్రం సుగుణక్క

**రాఖీతో చాటిన ఆత్మీయ అనుబంధం**

**అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలు**



**ఆసిఫాబాద్ ఆగష్టు 29 ప్రజా జ్యోతి** రాఖీ పౌర్ణ మి సందర్భంగా ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ కు ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షు రాలు ఆత్రం సుగుణక్క రాఖీ కట్టారు. ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగతో పాటు పలువురు మహిళా నాయకురాళ్లు ఎమ్మెల్సీకి రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మహిళా నాయకురాళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారో గ్యాలు వెల్లివిరియా లని ఆకాంక్షించారు. రాఖీ పండుగ ప్రేమ, ఆప్యాయత, సోదరభా వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రైమ్ పారామీటర్లలో రామగుండం కమిషనరేట్ పోలీసుల ఉత్తమ ప్రతిభ



**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** రాష్ట్రస్థాయిలో క్రైమ్ పారామీటర్ల అమలులో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీ రును సమీక్షించిన అధికారులు, అత్యుత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లను గుర్తించారు.ఈ క్రమంలో క్లస్టర్ లో హైదరాబాద్, క్లస్టర్ లో రామగుండం, క్లస్టర్ లో నల్గొండ, క్లస్టర్ లో సూర్యాపేట పోలీస్ యూనిట్లు మొదటి స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్‌లకు ఈరోజు డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

## స్వామివారి సేవలో భక్తులు

**-గూడెం గుట్టలో భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు**



దండేపల్లి,ఆగస్ట్ 29(ప్రజాజ్యోతి ): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గుట్టలో వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శ్రావణమాసం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంద ర్భంగా సుమారు వందల మంది దంపతులు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వాహనాల నియంత్రణ చర్యలు చేపట్టారు.

## నేడు తాళ్లపేటలో ఉచిత వైద్య శిబిరం

**దండేపల్లి,ఆగస్ట్ 29(ప్రజాజ్యోతి):**తాళ్లపేట స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నేడు ఆదివారం (30వ తేదీ) ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కార్తికేయన్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ చుంచు రాధికా కిరణ్ తెలిపారు. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో బి.పి, షుగర్ పరీక్షలు,స్త్రీల ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు, పిల్లల వైద్య పరీక్షలు,సాధారణ వైద్య సలహాలు, ఉచితంగా రక్త పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ చేయడం జరుగుతుంది అన్నారు.పరిసర ప్రాంత ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ రాధికా కిరణ్ కోరారు. ఇతర వివరాల కోసం 888 666 1234 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## వెంకటాపూర్ సొసైటీ చైర్మన్ ముత్యాల శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**దండేపల్లి,ఆగస్ట్ 29(ప్రజాజ్యోతి):** దండేపల్లి మండల కేంద్రం లోని యాదవ సంఘం భవనంలో దండేపల్లి యాదవ యూత్ ఆధ్వర్యంలో శనివారం వెంకటాపూర్ సహకార సంఘం ( పిఏసీ ఎస్) చైర్మన్ ముత్యాల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఇటీవల వెంకటాపూర్ పిఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి న సందర్భంగా యాదవ యూత్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.?ఈ సందర్భంగా నాయకు లు మాట్లాడుతూ.. సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ముత్యా ల శ్రీనివాస్ రైతులకు, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గొర్రెల పెంపక దారుల సొసైటీ అధ్యక్షుడు అల్లంల కుమారస్వామి యాదవ్, గొట్ల శ్రీనివాస్, గొట్ల అశోక్, గడ్డి తిరుపతి, చిన్నవేణి భాను, యా దవ్ యూత్ అధ్యక్షుడు అన్వేని బబ్లూ, అన్వేని మల్లేష్, రాజన్న, రవి, అనిల్, నాగార్జున, రమేష్, బాపు తదితరులు పాల్గొన్నారు

## లక్ష్మీకాంతపూర్ లో సాంస్కృతిక సారధి చైతన్య రథం

**ప్రభుత్వ పథకాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన**



**దండేపల్లి, ఆగస్ట్ 29(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (ఐపీఆర్ఓ) ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాలు, డిపిఆర్ఓ పర్యవేక్షణలో దండేపల్లి మండలం లక్ష్మీకాంతపూర్ గ్రామంలో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం చేత వినూత్నంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాకారులు తమ ఆటపాటలు, జానపద గేయాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూనే, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైతన్యపరిచారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవానికి కూడు, గుడ్డ, నీడ అందించడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని కళాకారులు పాటల రూపంలో చెప్పారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న 'పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, నూతన రేషన్ కార్డుల పంపిణీ గురించి వివరించారు. 'ఇందిరా మహిళా శక్తి' ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వర్షాకాలంలో వచ్చే రోగాల పట్ల అప్రమ త్తంగా ఉంటూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుకూరి మహేష్, సాంస్కృతిక సారధి బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సరైన రహదారులు లేక ఇబ్బంది పడుతున్న గిరిజన గ్రామాలు అంబులెన్స్ రాని వైనం అత్యవసర పరిస్థితులు ఇబ్బందు లు,పడుతున్న గిరిజనులు

చిన్నమాలి నుండి మాణిక్ పటర్ కు ఎడ్ల బండి ద్వారా బాలింత సూర్పం భీం భాయ్ కు తీసుకు వెళ్లే దాపుర పరిస్థితి

అత్యవసర పరిస్థితిలో ప్రాణాలు పోతున్న స్పందించని,అధికారు లు, ప్రజాప్రతినిధులు:కాగజ్ నగర్ మండలం పెద్దమాలిని గ్రామము మాణిక్ పటర్ వరకు రోడ్లు నిర్మించాలని వేడుకుంటున్న గిరిజన గ్రామాల ప్రజలు: రాజ్ గోండ్ సేవా సమితి కాగజ్నగర్ డివిజన్ నాయకులు సుర్పం మారు:




**ఆగస్టు29,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని కాగజ్నగర్ మండలంలో ఉన్న గిరిజన గ్రామాలు చిన్న మాలీని నుండి మాణిక్ పటర్ కు సరైన రహదారులు లేక ఇబ్బంది పడుతున్న ఆదివాసి గిరిజన ప్రజలు సూర్పం భీం బాయి అనే బాలింత మహిళను చిన్నమాని నుండి మాణిక్ పటర్ వరకు ఎడ్ల బండి ద్వారా ఇంటికి తీసుకు వెళ్లే దాపుర పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రహదారులు లేక ఇబ్బంది పడుతున్నా మని తమ గిరిజన గ్రామాలు అంబులెన్స్ సౌకర్యానికి కూడా కూడా నోచుకోలేదని నిరుత్సాహ పడుతున్నారు. అత్యవసర పరిస్థితులలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అవసరం పడుతూ ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల ఆస్పత్రిలో డెలివరీ అయినా సూర్పం భీం భాయ్ అనే మహిళను వాంకిడి నుండి కాగజ్ నగర్ కు అక్కడి నుండి వయా సిర్పూర్(టి) మీదుగా మాలిని వరకు తీసుకురావడం జరిగిందని కాగజ్నగర్ డివిజన్ రాజ్ గోండు రాజ్ సేవాసమితి నాయకులు సూర్పం మారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... చిన్న మాలిని నుండి మాణిక్ పటార్ వరకు సూర్పం భీం భాయ్ అనే బాలింతను ఎన్నో ఇబ్బందులతో ఎడ్ల బండి పై తీసుక వెళ్లే దాపుర పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాల పరిస్థితి చాలా దినగాల స్థితిలో ఉందని అత్యవసర పరిస్థితిలో ఎన్నో అవస్థలు పడుతున్నామని రహదారులు లేక వాహనాలు రాక ఎన్నో ప్రాణాలు కోల్పోతున్నా మని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే కాగజ్ నగర్ మండలంలోని పెద్ద మాలిని, చిన్న మాలిని, అదేవిధంగా సిర్పూర్ (టి) మండలం మేడిపల్లి మాణిక్ పటార్ గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు నిర్మించి ప్రయాణ సౌకర్యాలు కల్పించి ఆదివాసి గ్రామాల ప్రజల ప్రాణాలను కాపాడాలని జిల్లా అధికా రులను ప్రజాప్రతి నిధులను ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని తెలిపారు.

# ప్రశ్నించాలి.. ఉద్యమించాలి.. కార్మికుల హక్కులను కాపాడాలి...

### సింగరేణి వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి

### టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సింగరేణి కాలరీస్ సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను యాజమాన్యం వెంటనే ప్రకటించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025--26 ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ సింగరేణి యాజమాన్యం సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని రాజిరెడ్డి అన్నారు. సంస్థ ప్రగతి, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి 2025--26 ఆర్థిక సంవత్సరంపై బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం జరిగిందా? లేదా? అనే విషయాన్ని యాజమాన్యం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. దేశంలోని మహారత్న, మినీరత్న సంస్థలైన కోల్ ఇండియా తదితర సంస్థలు నిబంధనలకు లోబడి ఆర్థిక సంవత్సరం ముగిసిన రెండో నెలలోపే తమ సంస్థల ప్రగతి, లాభాలను ప్రకటించాయని తెలిపారు. అయితే సింగరేణి మాత్రం ఈ విషయంలో పూర్తిగా విఫలమవుతోందని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అనుకూల సంఘాలుగా ఉన్న గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ నాయకులు ఈ అంశంపై స్పందించకపోవడం దుర్మార్గమని రాజిరెడ్డి విమర్శించారు. కార్మికుల శ్రమతోనే సింగరేణి సంస్థ అభివృద్ధి చెందుతోందని, సంస్థకు వచ్చే లాభాల్లో కార్మికుల వాటా కూడా ఉందని అన్నారు. కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలను ప్రకటించకుండా జాప్యం చేయడం యాజమాన్యం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని



అన్నారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను తక్షణమే ప్రకటించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. టీబీజీకేఎస్‌లో చేరిన సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు నీలం సదయ్య, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి సమక్షంలో యూనియన్‌లో చేరారు. ఆయనకు యూనియన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండి రమేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పెట్టం లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీలు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, బ్రాంచ్ సెక్రటరీలు గడ్డం మహిపాల్‌రెడ్డి, గొర్ల సంతోష్, వెంగళకుమార్, స్వామి, తగల రమేష్, ఏరియా నాయకులు చిప్ప రమేష్, ఫిట్ సెక్రటరీలు గడ్డం సుధాకర్, తీగల వెంకటరెడ్డి, తోట నరేష్, గురుమూర్తి, చాట్ల రమేష్, శ్రీరాముల శ్రీనివాస్, గండు రాజు, రామారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అబద్ధపు హామీలు, వెయ్యి రోజుల అసమర్థ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తాం

### కేటీఆర్ పిలుపుమేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై నిరసన కార్యక్రమాలు

### మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

**మంచిర్యాల, 29, ఆగస్టు (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అబద్ధపు హామీలు, వెయ్యి రోజుల విఫల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనపై నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, హాజీపూర్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి, వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల తరఫున ప్రశ్నించి, హామీల అమలుకు పోరాడాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ నాయకులు,



కార్యకర్తలపై ఉందన్నారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన తీరును విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, హాజీపూర్ మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం కోసం.. ఓ దర్శకుడి నిరీక్షణ!

## కథపై నమ్మకం.. వెండితెరపై తన ముద్ర వేయాలన్న పట్టుదల

## ఒక్క ఛాన్స్ ఇస్తే.. నా సినిమా ఏంటో చూపిస్తా" అంటున్న యువ దర్శకుడు (సూరా)

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు29 (ప్రజాజ్యోతి):**సినిమా అంటే చాలామందికి ఒక కల. కానీ ఆ కలను నిజం చేసుకోవడానికి సంవత్సరాల తరబడి ఎదురుచూసే వారు కొందరే. అలాంటి వారిలో ఓ యువ దర్శకుడు కూడా ఉన్నాడు.అతనే కాబోయే డైరెక్టర్ సూరా..చిన్నప్పటి నుంచే సినిమాలంటే ఆసక్తి. తెరపై కనిపించే సన్నివేశాల కంటే.. ఆ సన్నివేశాన్ని ఎవరు ఎలా ఆలోచించారు? కథను ఏ విధంగా తెరపైకి తీసుకువచ్చారు? అనే ఆలోచనే అతడిని దర్శకుడిగా మారేలా చేసింది. ఇప్పుడు అతడి చేతిలో ఒక కథ ఉంది. కథ మాత్రమే కాదు దాన్ని సినిమాగా మలచాలనే పూర్తి ప్రణాళిక కూడా ఉంది. కావాల్సిందల్లా ఒక్క అవకాశం. అదే విషయాన్ని ఓ జర్నలిస్టుతో తన మనసులోని మాటగా పంచుకున్నాడు ఆ దర్శకుడు.నేను సినిమా కోసం కథ రాయలేదు.. నా చుట్టూ ఉన్న జీవితాన్ని గమనిస్తూ ఈ కథ పుట్టింది" అంటూ తన కథను ప్రారంభించాడు. కథానాయకుడు ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువకుడు. పెద్ద ఆశలు లేవు. ఎవరినీ ఓడించాలనే కోరిక లేదు. తన కుటుంబం సంతోషంగా ఉండాలి, తనకు నచ్చిన పని చేసుకుంటూ జీవితంలో ముందుకు వెళ్లాలనేదే అతడి లక్ష్యం. కానీ జీవితం ఎప్పుడూ మనం అనుకున్నట్టుగా ఉండదు. హీరో జీవితంలోకి అనుకోకుండా కొన్ని సంఘటనలు వస్తాయి. మొదట చిన్న సమస్యగా కనిపించిన విషయం క్రమంగా అతడి జీవితాన్నే మార్చేస్తుంది. తనకు నమ్మకం ఉన్న వ్యక్తులే ఒక్కొక్కరుగా దూరమవుతారు. తాను నిజమని నమ్మిన విషయం వెనుక మరో నిజం ఉందని అతడికి అర్థమవుతుంది. ఇక్కడి నుంచే నా అసలు కథ మొదలవుతుంది అని దర్శకుడు చెబుతున్నాడు. హీరో ఎదుర్కొనే సమస్య కేవలం అతడి వ్యక్తిగత సమస్యగా ఉండదు. దాని వెనుక మరికొంతమంది జీవితాలు, వారి ఆశలు, వారి ప్రయోజనాలు ఉంటాయి. ఒక్కో విషయం బయటపడే కొద్దీ కథలో కొత్త పాత్రలు పరిచయం అవుతాయి. కథానాయిక పాత్ర కూడా కేవలం పాటలు, ప్రేమ సన్నివేశాలకే పరిమితం కాదని దర్శకుడు చెబుతున్నాడు. హీరో జీవితంలో కీలక సమయంలో అతడికి అండగా నిలిచే వ్యక్తిగా ఆమె పాత్రను తీర్చిదిద్దినట్లు వివరించాడు. నా సినిమాలో హీరోయిన్‌ను హీరో వెనుక నడిచే పాత్రగా చూపించను. కథను ముందుకు నడిపించే పాత్ర ఆమెది" అని చెప్పాడు. అదే సమయంలో కథలో మరో ముఖ్యమైన పాత్ర ప్రేక్షకుడి ముందుకు వస్తుంది. మొదట అతడు మంచివాడిగానే కనిపిస్తాడు. హీరోకు సహాయం చేసే వ్యక్తిగా పరిచయం అవుతాడు. హీరో కూడా అతడిని పూర్తిగా నమ్ముతాడు. కానీ కథ ముందుకు వెళ్లేకొద్దీ అసలు విషయం బయటపడుతుంది. ఇంటర్వెల్ దగ్గర ప్రేక్షకుడు ఒక్కసారి 'అరే.. ఇదేంటి?' అని అనుకోవాలి. ఇప్పటి వరకు చూసిన కథకు మరో కోణం ఉందని అక్కడ తెలుస్తుంది" అని దర్శకుడు నవ్వుతూ చెబుతున్నాడు. ఇంటర్వెల్ తర్వాత సినిమా మరింత వేగం అందుకుంటుంది. హీరో ఇప్పటివరకు తనకు జరిగిన విషయాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఎవరు తనకు తోడుగా ఉన్నారు? ఎవరు తనను మోసం చేశారు? అసలు సమస్య ఎక్కడ మొదలైంది? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతాడు. ఈ క్రమంలో అతడికి తన కుటుంబం గురించి కూడా కొన్ని తెలియని విషయాలు తెలుస్తాయి. కథలో తండ్రి పాత్రకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఇచ్చినట్లు దర్శకుడు చెబుతున్నాడు. తండ్రి--కొడుకుల మధ్య ఉండే భావోద్వేగాన్ని సహజంగా చూపించాలనేది తన ఉద్దేశమని పేర్కొన్నాడు. ప్రతి తండ్రి తన కొడుకుతో చెప్పలేని కొన్ని మాటలు ఉంటాయి. ప్రతి కొడుకూ తన తండ్రికి చెప్పలేని కొన్ని విషయాలు ఉంటాయి. ఆ భావోద్వేగమే సినిమాలో చాలా కీలకమైన సన్నివేశంగా ఉంటుంది" అని వివరించాడు. కథలో స్నేహానికి కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. హీరోతో చిన్నప్పటి నుంచి ఉన్న స్నేహితుడు చివరి వరకు అతడికి అండగా ఉంటాడా? లేక పరిస్థితుల కారణంగా దూరమవుతాడా? అనే ప్రశ్న ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేలా కథ సాగుతుంది. దర్శకుడు చెబుతున్నదాని ప్రకారం సినిమా కేవలం యాక్షన్, ప్రేమ, వినోదం చుట్టూ తిరగదు. ప్రతి సన్నివేశానికి కథతో సంబంధం ఉంటుంది. నాకు అనవసరమైన సన్నివేశాలు పెట్టడం ఇష్టం లేదు. ప్రేక్షకుడు ఒక సన్నివేశం చూసిన తర్వాత 'ఇది ఎందుకు వచ్చింది?' అనుకోకూడదు. చివరికి ఆ సన్నివేశం ఎందుకు పెట్టామో అర్థమయ్యేలా కథనం ఉండాలి" అని అంటున్నాడు. క్లైమాక్స్ విషయానికి వస్తే మాత్రం దర్శకుడు పూర్తి వివరాలు చెప్పడానికి ఇష్టపడలేదు. క్లైమాక్స్ నేను ముందే చెప్పేస్తే సినిమా చూసే ఆసక్తి పోతుంది. కానీ ఒక్క విషయం మాత్రం చెబుతాను. హీరో గెలిచాడా? ఓడిపోయాడా? అనే ప్రశ్న కంటే.. చివర్లో హీరో తీసుకునే నిర్ణయం ప్రేక్షకుడిని ఆలోచింపజేస్తుంది" అని చెబుతున్నాడు. సినిమా రంగంలో అవకాశం కోసం ఎదురుచూడటం తనకు కొత్త కాదని దర్శకుడు చెబుతున్నాడు. ఎన్నో కథలు రాశానని, కొన్ని కథలను కొంతమందికి చెప్పానని, అయితే ఇప్పటివరకు తన కలకు సరైన అవకాశం దక్కలేదని అంటున్నాడు. అయినా నిరాశ చెందడం లేదని స్పష్టం చేస్తున్నాడు. సినిమా నాకు ఉద్యోగం కాదు.. నా కల. ఒకసారి అవకాశం వస్తే ఆ అవకాశాన్ని వృథా చేయను" అని అంటున్నాడు. తన కథకు సరిపోయే నటీనటులు, నిర్మాత దొరికితే సినిమాను పెద్ద స్థాయిలో కాకపోయినా మంచి కంటెంట్‌తో తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నాడు. ప్రేక్షకుడి డబ్బుకు విలువ ఉండే సినిమా చేయాలనేదే తన లక్ష్యమని చెబుతున్నాడు. బడ్జెట్ పెద్దదా? చిన్నదా?




అనేది తర్వాత విషయం. కథ బలంగా ఉంటే చిన్న సినిమా కూడా ప్రేక్షకుల మనసులో పెద్ద స్థానాన్ని సంపాదించగలదు. నాకు అలాంటి సినిమా చేయాలనుంది" అని దర్శకుడు పేర్కొన్నాడు. కొత్త దర్శకులకు సినీ పరిశ్రమలో అవకాశాలు రావడం కష్టమే అయినప్పటికీ, కొత్త ఆలోచనలకు కూడా ఇప్పుడు ప్రేక్షకులు ఆదరణ ఇస్తున్నారని అతడు నమ్ముతున్నాడు. తన కథను ఒకసారి పూర్తిగా వినే అవకాశం ఎవరు ఇచ్చినా.. ఆ తర్వాత తన పని తానే మాట్లాడుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నాడు. నేను ఎవరినీ అడిగి స్టార్ డైరెక్టర్ అవ్వాలని కోరుకోవడం లేదు. నాకు ఒక అవకాశం ఇవ్వండి. కథ చెప్పే అవకాశం ఇవ్వండి. నచ్చితే సినిమా చేయండి. నచ్చకపోతే తిరస్కరించండి. కానీ కథ వినకుండానే కొత్తవాళ్లకు అవకాశం లేదని చెప్పకండి" అని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. చివరగా మాట్లాడుతూ..నా దగ్గర ప్రస్తుతం పేరు లేదు.. పెద్ద బ్యానర్ లేదు.. స్టార్ హీరో లేరు. కానీ కథ ఉంది. ఆ కథపై నమ్మకం ఉంది. దర్శకుడిగా ఏం చేయగలనో నిరూపించుకోవాలనే తపన ఉంది. ఒక మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను. ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో తెలియదు. కానీ వచ్చిన రోజు మాత్రం వెనక్కి తగ్గను" అని తన మనసులోని మాటను చెప్పాడు. ఇలా తన కథను, తన కలను, తన ప్రయాణాన్ని ముందు వివరించిన ఆయువ దర్శకుడి ఎదురుచూపులు ఎప్పుడు ఫలిస్తాయో చూడాలి. ఎన్నో కలలు అవకాశాల కోసం తలుపు తడుతుంటాయి. వాటిలో కొన్ని మాత్రమే వెండితెరను చేరుతాయి. ఈ దర్శకుడి కథ కూడా అలాంటి ఓ కలగా మొదలై.. ఎప్పుడో ఒకరోజు వెండితెరపై నిజమవుతుందేమో చూడాలి... డైరెక్టర్ సూరా!.

## క్రీడాకారులను సన్మాన

**రామడుగు:** రామడుగు మండలం గోపాల్ రావు పేట లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శనివారం రోజున గోపాల్ రావుపేట ప్రభుత్వ పాఠశాల లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్రీడాకారులు రేణికుంట అభిషేక్ వాలీబాల్ పల్లపు దివ్య శ్రీ వాలీబాల్ పీడీ దొడ్డ వీరపాల్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు ఉపాధ్యాయులు గుజ్జం జలపతి రెడ్డి కుర్ర రవిని సన్మానించారు. లయన్స్ క్లబ్ మైక్రో కేబినెట్ మెంబర్స్ గోలి మధుసూదన్ రెడ్డి కర్ర శ్యాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు జాతీయ సమైక్యత భావ సమైక్యత పెంపొందుతాయాని శరీరక దృఢత్వం మానసిక ఉల్లాసం పెంపందుతుందని వారు సూచించారు.ఎన్ని భాషలు వచ్చిన మాతృభాషను మరువద్దన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ పీడీ వీపాల్ రెడ్డి తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గౌడుగు అంజి యాదవ్ పాకాల మోహన్ కోశాధికారి మూల అనంత రెడ్డి మైక్రో కేబినెట్ మెంబర్స్ గోలి మధుసూదన్ రెడ్డి కర్ర శ్యాం సుందర్ రెడ్డి డైరెక్టర్స్ ముదుగంటి చంద్రశేఖర్ రెడ్డి ఎడవెల్లి రాజిరెడ్డి పబ్బతి మల్లారెడ్డి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ్ దంపతులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం

**సూర్యాపేట** : ఉత్తమ్ దంపతులు కోదాడ, హుజూర్నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని చేసిన అభివృద్ధిపై చర్చకి రావాలని వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కోదాడ మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత 5 ఏళ్ల ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి ఇప్పుడు జరిగిన అభివృద్ధిపై చర్చకు దమ్ము, ధైర్యం ఉంటే సమయము, ప్లేసు చెబితే అక్కడికి వస్తామని కానీ పుణ్య దంపతులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే మా తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. కౌన్సిలర్ గా ఓడిపోయిన ఉపేందర్ అనే వ్యక్తి డబ్బా కొట్టు పెట్టుకొని బ్రతుకుతున్నాడు అన్న పదానికి అర్థం లేదని ఉత్తమ్ దంపతులు క్షుద్ర పూజలు చేస్తున్నారు అనటం సిగ్గుమాలిన చర్య అని దీని వెనక బొల్లం మల్లయ్య యాదవ్ హస్తం ఉందని అన్నారు. ఇలా అన్న వ్యక్తిని పట్టణ సిఐ ఏ ఆయుధం లేకుండా అతనిని అదుపులోకి తీసుకోవటం దానిని కూడా రాజకీయం చేయటం సబబు కాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ యువకులను రెచ్చగొట్టి ఈ విధంగా అనిపించటం వారి భవిష్యత్తుని నాశనం చేయడం

# జిల్లా పాలన అధికారి కె. హరిత ఆకస్మిక పర్యటన లో భాగంగా దహేగాం మండలంలోని చిన్న రాస్పల్లి గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాల సందర్శన

పాఠశాల విద్యార్థుల దినసరి హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి 100% హాజరే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి

రక్షిత మంచినీటి, తరగతి గదులు, టాయిలెట్లు,పరిశాల పరిశుభ్రత పరిశీలన:

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం:

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా నాణ్యమైన విద్యను అందించే

ప్రభుత్వ బడులకే పంపాలి: పాఠశాలల్లో సైతం నాణ్యమైన ఆంగ్ల మధ్యమ విద్య అందుబాటులో ఉంది జిల్లా కలెక్టర్ కె. హరిత:

**ఆగస్టు29,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని దహేగాం మండలంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కే హరిత ఆకస్మిక పర్యటనలో భాగంగా దహేగాం మండలంలోని చిన్న రాస్పల్లి గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠ శాలను పర్యవేక్షించారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థు లు 100% శాతం బడికి వచ్చేలా ఉపాధ్యాయు లు, స్థానిక ప్రజా ప్రతి నిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిరంతరం కృషి చేయాలని జిల్లా పాలనాధికారి కె.హరిత అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్లు, రక్షిత మంచినీటి వసతి అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల దినసరి హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.



**కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ.....**

100% హాజరు శాతమే విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసు కుంటుందని అన్నారు. బడుల్లో అవసరమైన మౌలిక వసతులను వేగంగా కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు.?తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ బడులకే పంపించేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సైతం నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య అందుబాటులో ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మధ్యమంలో నాణ్య మైన విద్య అందుబాటులో ఉన్న విషయాన్ని గ్రామీణ ప్రాంత ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా పాలన అధికారి కె. హరిత తెలిపారు.?ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ రచ్చ!

-మొదటిపేజీ తరువాయి

నరేష్ జాదవ్ ప్రతి విషయంలోనూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ పార్టీ నేతలను విస్మరిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన అధిష్ఠానం వద్ద తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు.?శనివారం ఉదయం ఆడే గజేందర్ తన అనుచరులు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను నేరుగా కలిసి జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఫిర్యాదు చేయనున్నారు. ముఖ్యంగా ఇటీవల ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పీసీసీ కమిటీలో తనకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై గజేందర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనికితోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ల ఎంపిక ప్రక్రియలో బోథ్ నియోజకవర్గానికి చెందిన ఆశావహుల పేర్లను పక్కనబెట్టి, డీసీసీ అధ్యక్షుడు తన ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆయన వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. జిల్లా అధ్యక్షుడి వ్యవహారశైలి వల్ల పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పెరిగిపోతున్నాయని, క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులకు అన్యాయం జరుగుతోందని ఆడే గజేందర్ అనుచరులు ఆరోపిస్తున్నారు. పార్టీ ప్రతిష్టను కాపాడటంతోపాటు సంస్థాగతంగా బలోపేతం చేయాలంటే తక్షణమే జిల్లా అధ్యక్షుడిని మార్చాలని, పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే నేతకు జిల్లా పగ్గాలు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బోథ్ నియోజకవర్గ నేతల ఈ పర్యటన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# 30 ఏళ్లుగా జీవనాధారమైన ఒంటరి మహిళ డబ్బా తొలగింపుపై తీవ్ర నిరసన

పోలీసుల పక్షపాత వైఖరికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 2వ తేదీన పోలీస్ స్టేషన్ ఎదుట మహాధర్నా

మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్

**సూర్యాపేట** కోదాడ నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలన లేకుండా పోయిందని, అమాయకులపై దౌర్జన్యాలు చేస్తూ ఆటవిక రాజ్యం, పోలీసు రాజ్యం నడుపుతున్నారని కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూర్యాపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ బడుగుల లింగయ్య యాదవ్ తో కలిసి బాధితురాలు గంధం కనకమ్మ కుటుంబాన్ని పరామర్శించి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసు అధికారుల తీరును, అధికార పక్ష కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఎండగట్టారు. వాట్సాప్ గ్రూపులలో ఫార్వర్డ్ మెసేజ్‌లు పెట్టారనే చిన్న కారణంతో హైదరాబాద్‌లో ఉన్న ఉపేందర్ అనే వ్యక్తిని ఏదో దేశద్రోహి తరహాలో కోదాడ పోలీసులు బలగాలతో వెళ్లి పట్టుకొచ్చి, అర్ధరాత్రి వరకు విచారణ పేరిట మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. న్యాయవాదులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ కల్పించు కునేంత వరకు అక్రమంగా నిర్బంధించారని మండిపడ్డారు. ఉపేందర్‌కు సోదరి అయినందుకే కక్షగట్టి, కోదాడ బొడ్రాయి సెంటర్‌లో గత 30 ఏళ్లుగా పాన్ డబ్బా నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న కనకమ్మ అనే ఒంటరి మహిళ డబ్బాను తెల్లవారుజామున అకస్మాత్తుగా తొలగిం చడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాఖీ పండుగ వేళ న్యాయం కోసం నిరసన తెలిపిన మహిళలు, కుటుంబ సభ్యులపై సీఐ శివశంకర్ నేతృత్వంలో పోలీసులు గూండాల మాదిరిగా వ్యవహరించి దాష్టీకం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాతే పట్టణంలో గంజాయి దందాలు, అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. పట్టుబడ్డ క్వింటాన్నర గంజాయిని మాయం చేసి అమ్ముకున్నా, బర్రెల దొంగల నుంచి లంచాలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నా పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో తన ప్రెస్ మీట్‌పై ఒక సీఐ హోదాలో ఉండి అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినప్పుడు, ఆధారాలతో డీజీపీ, ఎస్పీ, డీఐజీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా





ఏడాదిన్నరగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్ జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోతే స్పందించని పోలీసులు, సామాన్యుల పొట్ట కొట్టడానికి మాత్రం ఉత్సాహం చూపుతున్నారని విమర్శించారు. గతంలో రాజకీయ ఇబ్బందులు పెట్టేందుకు దళిత బిడ్డ కర్ల రాజేష్ ను ఎలా పొట్టనబెట్టుకున్నారో గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే రీతిలో ఉపేందర్ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసి రోడ్డున పడేసే కుట్రలు చేస్తున్నారని హెచ్చరించారు. సామాన్య ప్రజల పొట్టకొట్టే దౌర్జన్యాలు ఆపాలని, బాధిత మహిళ కుటుంబానికి తక్షణమే పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఏకపక్ష వైఖరికి, అక్రమ కేసులకు నిరసనగా సెప్టెంబర్ 2వ తేదీన సహచర, ప్రజాస్వామిక పక్షాలను కలుపుకుని కోదాడ పోలీస్ స్టేషన్ ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. చట్టం ప్రకారం న్యాయపోరాటం చేయడంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ బాధితుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.